

# ముక్తిపథం



సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ ప్రసాదం



**భగవంతుడిని బయట వెతుకుతున్నామంటే నాస్తికుల కంటే కిందిస్థాయిలో జీవిస్తున్నామని గుర్తు:** గుడికి వెళ్లి భగవంతుడిని దర్శించటం వలన మనస్సు, బుద్ధి పవిత్రమై పునీతులౌతాము. అయితే భగవంతుడిని ఆ గుడికి, ఆ రూపానికి పరిమితం చెయక అంతటా చూడగలగాలి. ముందు నీలో ఉన్నవాడిని దర్శిస్తే అంతటా చూడగలవు. భగవంతుడు ఉన్నమాట నిజమే కాని మాటకు, మనస్సుకు, ఇంద్రియాలకు అందడు. వాటితో పట్టుకోటానికి చూస్తావేమిటి? నీ ఇంద్రియాలకు, మనస్సుకు భగవంతుడు ఏమైనా ఓబ్జెక్టా (object)? భగవంతుడిని ఆరాధించండి, స్మరించండి, ధ్యానించండి, పూజించండి కాని బయట వెతక్కండి. అలా వెతుకుతున్నారంటే ఎవరో కాదు నాస్తికులు, మీరే నాస్తికులు. మీకంటే నాస్తికుడే నయం. భగవంతుడు లేడు, ఉంటే ఎక్కడ ఉన్నాడు చూపించండి అంటాడు నాస్తికుడు. భక్తి పేరు మీద భగవంతుడిని బయట వెతుకుతున్నామంటే నాస్తికుల కంటే కిందిస్థాయిలో జీవిస్తున్నామని గుర్తు. భగవంతుడ్ని ఆరాధించండి కాని అంతర్యామిగా, అంతటా ఉన్నాడనే భావనతో ఆరాధించండి. ఆ ఎరుక కలిగి జీవించండి. గుడితో ప్రారంభమైన మన భక్తి విశ్వమంతా ఆలయంగా చూసే స్థాయికి ఎదగాలి. అంతటా అన్ని రూపాల్లో ఉన్నది ఈశ్వరుడే అనే భావం స్థిరపడాలి. అది నిజమైన భక్తి.




**స్తోత్రం చేసినా విమర్శించినా భక్తుడికి ఏమీ అనిపించదు**: భగవద్గీత 12 వ అధ్యాయంలో కృష్ణుడు: 'భక్తుడు సంతోషించడు దుఃఖపడడు' అని అన్నాడు. సంతోశము, దుఃఖము రెండూ బయట గొడవల నుంచే వస్తాయి. లోకం అసత్యం. ఈ రెండు అసత్యం లోంచి వస్తున్నాయని భక్తుడు వదిలేస్తాడు. బయట దుఃఖకారణాలు ఉన్నా సంతోష కారణాలు ఉన్నా భక్తునికి దుఃఖం రాదు, సంతోషం రాదు. ఈ రెండు అసత్యమని భక్తునికి అనుభవంలో ఉంటుంది కాబట్టి వాడికి ఏమి అనిపించదు. ప్రతి శరీరానికి ప్రారబ్ధం రకరకాలుగా మారుతూ ఉంటాయి. సౌభాగ్యం వచ్చినప్పుడు సంతోషిస్తాడు. దౌర్భాగ్యం వస్తే దుఃఖపడతాడు. దేహముతో తాదాప్యం ఉంటే వాటి ప్రభావం ఉంటుంది. తనువు తాను కాదని తెలిసిన వాడికి చెడు ముట్టుకోదు, మంచి ముట్టుకోదు. లోకంలో శబ్దాలన్నీ అసత్యాలే. వాడిని స్తోత్రం చేసినా విమర్శించినా భక్తుడికి ఏమీ అనిపించదు. అది అబద్ధం అని తెలిసినప్పుడు వాటి ప్రభావం వాడి మీద ఉండదు. హాయిగా ఉంటాడు.




**మీరు శుద్ధ భక్తి, అహేతుక భక్తి, అకారణ భక్తి సంపాదించుకోండి**: చెట్టు మొదల్లో నీళ్ళు పోస్తే ఆకులకు, కొమ్మలకు, పూలకు, పళ్లకు, వేర్లకు అన్నిటికి నీళ్ళు అందుతాయి. అలాగే భగవంతుడి పాదాలు ఆశ్రయించి ఉంటే ఎప్పుడు ఏది అవసరమో అవన్నీ ఆయనే చూసుకుంటాడు అన్నాడు రామతీర్థ. పాదు పందిరిని అల్లుకు పోయినట్లు ఈశ్వరుని పాదాలకు అల్లుకు పోవాలి. అక్కడ ఏమి కోరిక ఉండకూడదు. అలా అల్లుకు పోతే ఇంక ఏమి ఉంది? నీకు శాంతే శాంతి, ఆనందమే ఆనందం, సుఖమే సుఖం. రామకృష్ణ పరమహంస అన్నారు: 'మీరు శుద్ధ భక్తి సంపాదించుకోండి'. అది అహేతుక భక్తి. అంటే అకారణ భక్తి - కారణం లేకుండా భగవంతుని పట్ల భక్తి కలిగి ఉండడం. కారణం కనిపిస్తూ ఉంటే ఆ భక్తి నిజం కాదు. సుధాముడు కృష్ణుడి దగ్గరికి వెళ్లి ధనం, సంపదలు అడగ లేదు. అలాగే స్వామీ వివేకానంద కూడా గుడికి వెళ్లి అమ్మవారిని భక్తి, జ్ఞాన, వివేకం వైరాగ్యాలు అడిగారు. అలా మనం ఎవరైనా అడుగుతామా? పనికి రానివన్నీ అడుగుతాం. పనికి వచ్చేవి అడగటానికి మన తెలివి ఎంత? మన మెదడెంత? కష్టపడి పని చేసుకుంటే ఫలితం వస్తుంది, నాలుగు డబ్బులు సంపాదించుకోవచ్చు అనుకుంటాం కాని వైరాగ్యం వల్ల ఫలమేముంది అనుకుంటాం. వైరాగ్యానికి కూడా ఫలితం ఉంది. వైరాగ్యం వల్ల ఏమి కలిసి రాదనుకోకండి. వైరాగ్య ఫలం మోక్షం; వైరాగ్య ఫలం ఆత్మ జ్ఞానం.



వైరాగ్యం వల్ల తరగని జ్ఞానం వస్తుంది. సుధాముడు కృష్ణుడిని ధనం అడుగడు. ధనం ఉన్నవాళ్ళంతా సుఖ పడతారు. ధనం లేనివారంతా దుఃఖపడతారు అనేమిలేదు. వందేసి ఎకరాలు ఉన్నవారు, పది కోట్లు ఉన్నవారు, పది బంగళాలు ఉన్నవారు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇక భగవంతుడిని ఎందుకు ధనం అడగటం? సుధాముడు కృష్ణుడిని రెండు అడుగుతాడు: 1) జన్మించటం మరణించటం తిరిగి జన్మించటం మరణించటం- ఇది ఒక చక్రం. ఈ చక్రంలోంచి నీ దయ లేకుండా జీవుడు బయటపడలేడు. కారణం నువ్వు చెప్పినట్లు మాయ వింటుంది. మా మాట వినదు. నీ పాదాలు ఆశ్రయించకుండా ఎవడూ జననమరణాలనే సంసార మాయాచక్రంలోంచి ఎవరూ ఒడ్డుకు రాలేరు. అందుచేత నీ పాదాలయందు భక్తి ఒక్కటే కాదు, నాకంటే నిన్ను ఎవరు బాగా ఇష్టపడుతున్నారో వారితో సహవాసం నాకు లభించేటట్టు చూడు. ఎందుచేతనంటే మంచి స్నేహాలవల్ల బాగుపడతాం. చెడు సహవాసాలుబట్టి మంచి వాళ్ళు కూడా పాడై పోయిన వారున్నారు. అందుచేత నీ పాదాలు ఆశ్రయించి నిన్నే కేంద్రంగా పెట్టుకొని జీవించేవాళ్ళతో నాకు సహవాసం కలిసేలా అనుగ్రహించు. 2) నాకేది మంచిదో అదే ఇతరులకు కూడా మంచిది అని అర్థం చేసుకునే సద్బుద్ధి నాకు ప్రసాదించు అంటాడు కాని డబ్బు ఏమి అడగలేదు. ఇది బాగుపడే వాడి లక్షణం.



**కృష్ణుడు most practical man. ground reality కి దగ్గరగా ఉంటాడు**: బుద్ధుడి కంటే ఆచార్యులవారి కంటే కృష్ణుడు most practical man. బుద్ధుడు ఆచార్యులవారి కంటే పనికి ఎక్కువ importance ఇచ్చాడు కృష్ణుడు. 'నీ అవసరాలు కోరిక ఎలా అవుతుంది?' అన్నాడు కృష్ణుడు. ground reality కి దగ్గరగా ఉంటాడు కృష్ణుడు. selfless work లేకుండా నీకు purification రాదు. జీవితంలో ఎంతోకొంత selfless work చేయాలి. అప్పుడుకాని purify అవ్వవు, ఏకాగ్రత రాదు. 'అర్జునా నీవు కతృత్వం లేకుండా ఈ మూడు లోకాలను దగ్ధం చేసినా పాపం రాదు' అన్నాడు కృష్ణుడు. Individuality లేని వాడికి పుణ్యం ఏమిటి, పాపం ఏమిటి? వ్యక్తి పోయిన తర్వాత, అహం భావన పోయాక మూడు లోకాలను భస్మం చేసినా పాపం రాదు. ఆ స్థాయికి వెళ్ళాలి కదా! నోటితో చెప్పుకోవడం తేలిక. కృష్ణుడు అర్జునుడికి చెప్పింది 'do or die'. నువ్వు వాళ్ళని చంపితే రాజ్యం వస్తుంది. వాళ్ళు నిన్ను చంపితే నీకు మోక్షం వస్తుంది. కృష్ణుడికి ఉన్న courage ఏ teacher కి లేదు. గీతలో కృష్ణుడు అన్నాడు: 'పెద్ద పెద్ద చెట్ల వ్రేళ్ళు ground water లోకి వెళ్లిపోతాయి. ఇక వేసవికాలం వాటిని ఏమి చేయలేదు. అలాగే truth realized soul ని ప్రపంచం ఏమి చేయలేదు'.




**ఆనందమే స్వరూపంగా గల వాడిని ఎత్తుకున్నట్లు యశోదకు తెలియదు:** కృష్ణుడిని చిన్నప్పుడు యశోద చంకన వేసుకొని ఎత్తుకునేది. కృష్ణుడిని ఎత్తుకునే సరికి ఆవిడకు ఆనందం వచ్చేసేది. 'ఇంత ఆనందం వచ్చేస్తుందేమిటి?' అనుకునేది యశోద. అంతేకాని ఆనందమే స్వరూపంగా గల వాడిని ఎత్తుకున్నట్లు ఆమెకు తెలియదు. ఆవిడేమి సైతాన్ను ఎత్తుకోలేదు. ఎత్తుకోబడినవాడు బ్రహ్మం అన్న సంగతి ఆవిడకు తెలియదు. యశోద ఎత్తుకున్నది సర్వేశ్వరుడిని. అందుకే అంత ఆనందం వచ్చేసింది. ఆవిడకు ఎత్తుకున్నది బ్రహ్మంను అని తెలియకపోయినా అక్కడ వచ్చేది ఆనందమే. వాడి పేరే ఆనందం. వాడే ఆనందం.



**తలంపు సహస్రారం లోకి రాకముందే మనస్సులో ఏముందో అంతర్యామికి తెలుసు:** భారత యుద్ధంలో కర్ణుని మరణానంతరం ఆ స్థానంలోకి శల్యుడు వస్తాడు. శల్యుడు కూడా మహా మహా వీరులతో సమానం. సరే శల్యునితో ఎవరు యుద్ధం చయాలి అని సెలక్షన్ చేస్తే భీముడిని అయినా అర్జునుడిని అయినా select చేయాలి. కాని కృష్ణుడు 'ధర్మరాజా నువ్వు వెళ్లి శల్యుని తో యుద్ధం చేయి' అంటాడు. అక్కడున్న వారంతా ఆశ్చర్యపోతారు. ధర్మరాజు మంచివాడు, సహృదయం కలవాడే అయితే శల్యునితో యుద్ధం చేసేంత సమవుజ్జీ కాదు. ఇదేంటి కృష్ణుడు దేవుడు అనుకున్నాం. ఆయన mind సరిగ్గా పని చేయటం లేదా ఏంటి? అనుకున్నారంతా. అయితే శల్యుడు ధర్మరాజుకు స్వయాన మేనమామ. అంతే కాదు మేనల్లుడైన ధర్మరాజంటే శల్యుడికి విపరీతమైన మమకారం. శల్యుడికి లోపల ధర్మరాజు పట్ల ఎంత మమకారం ఉందో కృష్ణ పరమాత్మకు తెలుసు కాని వీళ్ళ ఎవ్వరికీ తెలియదు. మీ గుండెల్లో ఏముందో నీకు తెలియని విషయాలు కూడా పరమాత్మకు తెలుస్తాయి. కారణం పరమాత్మ అంతర్యామి. ఒకోసారి మన మనస్సులో ఏముందో మనకు తెలియదు. ఎందుచేతనంటే మనస్సుకు హృదయం పుట్టినిల్లు, మెదడు అత్తవారిల్లు. హృదయంలోంచి సహస్రారంలోకి వచ్చినప్పుడే మనస్సులో ఉన్న ఆలోచన మనకు తెలుస్తుంది. ఆ తలంపు సహస్రారం లోకి రాకముందే మనస్సులో ఏముందో అంతర్యామికి

తెలుసు. శల్యుడికి ధర్మరాజు మీద విపరీతమైన మమకారం ఉంది. వాడు ఎలాగైనా ధర్మరాజుని చంపడు వాడే చచ్చిపోతాడు అని కృష్ణుడు plan వేసాడు. మామూలుగా అయితే చంపేయగలడు కాని ఇష్టం వల్ల చంపలేడు. అలాగే యుద్ధం చేసి ధర్మరాజుని చంపలేక ధర్మరాజు చేతిలో శల్యుడు మరణించాడు. అది భగవంతుని సర్వజ్ఞత్వం. ఆయనకు తెలిసినంతగా మన మంచి ఏదో మనకు తెలియదు. అలాగే అర్జుని చేతిలో భీష్ముడు చనిపోయాడు. కత్తులు, కటారులు జయించలేనివి ప్రేమ ఆప్యాయతలు జయిస్తాయి.



**రాముడు తలకాయలో లేడు గుండెలో ఉన్నాడు**: కబీరు రామభక్తుడు. భక్తులకు అన్నం పెట్టటానికి దొంగతనం చేసేవాడు. దొంగతనం చేసి ఇంట్లోవారిని లేపి మరీ చెప్పి వచ్చేవాడు. 'రేపటికి బియ్యం సరిపడ ఉంచి వెళ్తున్నాను' అనేవాడు. ఇప్పుడుకూడా కాశిలో కబీరుని దొంగ అని అనరు; రామభక్తుడు అని అంటారు. కబీరు ఎంత రామభక్తుడంటే వాడి తలకాయ తీసివేసినా గుండె మాత్రం 'రామ రామ' అంటుంది. రాముడు తలకాయలో లేడు గుండెలో ఉన్నాడు.

**ఈశ్వరుడు నిర్ణయించిన దాన్ని నువ్వు నిమిత్తమాత్రంగా చేస్తావు**: రామాయణం ఎలా ప్రారంభం అయ్యిందంటే వాల్మీకి స్నానం చేస్తూఉంటాడు. అప్పుడు రెండు పక్షులు ఆకాశంలో ఎగురుతూ ఉంటాయి. ఒక బోయ వాడు ఆ పక్షులను కొడతాడు. అందులో మొగపక్షి చనిపోతుంది. ఆడపక్షి ఏడుస్తుంది. ఆ ఏడుపు చూసి వాల్మీకికి కోపం వస్తుంది. పక్షి ఎలా చంపబడిందో ఆ పక్షిని చంపిన బోయవాడు కూడా అలా చంపబడుగాకా అని ఉద్రేకంగా అన్నాడు. తర్వాత ఆశ్రమానికి వచ్చాక: 'అది వాడి వృత్తి కదా అనవసరంగా తొందర పడ్డాను' అని పశ్చాత్తాప పడతాడు. ఆ బోయ వాడిని శపిస్తూ ఒక శ్లోకం చెప్తాడు. ఇంటికి వచ్చి 'తొందర పడ్డాను' అని బెంగ పెట్టుకుంటాడు వాల్మీకి. అప్పుడు బ్రహ్మదేవుడు వచ్చి: 'ఏమి వాల్మీకి. అంత తపస్సు చేసినా బెంగగా ఉన్నావెందుకు?'అన్నాడు. 'నేను తొందర పడి శపించాను' అన్నాడు వాల్మీకి. అప్పుడు బ్రహ్మదేవుడు అంటాడు: 'అది నీ నిర్ణయం కాదు. నా నిర్ణయం. నేనే నిర్ణయించాను. నీ నోటివెంట వచ్చింది. నేను నిర్ణయించిన దాన్ని నువ్వు నిమిత్తమాత్రంగా చేశావు అంతే. నీ నోటి ద్వారా ఒక శ్లోకం వచ్చింది. ఆ శ్లోకం ఎలా వచ్చిందో ఆ లయతోనే రామాయణం మొదలు పెట్టు. ఏ scene లో ఎలా act చేయాలో actor కు director చెబుతాడు. అలా ఆ నిర్ణయం వాల్మీకికి జరిగిపోయింది. నా నిర్ణయం నీ నోటి ద్వారా వచ్చింది. నీకు దుఃఖమేల? నిర్ణయించటానికి నీవు ఎవరవు? నిర్ణయం నాది నువ్వు act చేసావు. నువ్వు నారదుడిని 16 మంచి లక్షణాలు ఉన్నవాడి గురించి అడిగావు కదా. అవి రాముడిలో ఉన్నాయి. కనుక నువ్వు రామాయణం మొదలు పెట్టు. చాలా మంది బోయ వాళ్ళు ఉన్నారు కాని వాడే ఎందుకు చంపాడు? వాడు అలా చంపబడాలి అని నేనే నిర్ణయించాను. అందుచేత నీవు శపించావు. బెంగ అనవసరం వాల్మీకి. నిర్ణయం నాది'.



మన శరీరం ఏ రోజు చనిపోవాలో నిర్ణయించబడి ఉంటుంది. ఒకే శరీరంలో ఉండగా రకరకాల ప్రారబ్దాలు. చాలా విచిత్రంగా ఉంటుంది. బ్రహ్మదేవుడు చెప్పింది నూటికి నూరుపాళ్లు నిజం. అయితే మనం నమ్మము. అదే మాయ.



**తలకాయ, గుండె, కంఠం- ఈ మూడూ సమానంగా పెట్టి మాట్లాడేవాడి మాటలు wonderful గా ఉంటాయి:**

ఆంజనేయస్వామికి ఒక పేరుంది - వీరవీరుడని. అంటే ప్రపంచంలో ఉన్న వీరులందరికీ వీరుడని అర్థం. హనుమంతుడు మహా బలవాన్. అటువంటి కర్మయోగి మనకు కనపడడు. రాముని పనే తన పని. తన సొంతపని అంటూ ఏదీలేదు. ఆయన ఎంత బలవంతుడో అంత విద్యావంతుడు. ఆంజనేయస్వామి రామలక్ష్మణుల వద్దకు వెళ్లి తనను తానే పరిచయం చేసుకున్నాడు. 'సుగ్రీవుని దగ్గర మంత్రిని నేను. నన్ను హనుమా అని పిలుస్తారు. మీ ముఖాలు చూస్తే రాజకుమారులుగా కనిపిస్తున్నారు. వేషాలు చూస్తే మునుల వేషాలుగా ఉన్నాయి. మీరు ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చారు?' అని అడిగాడు. అప్పుడు లక్ష్మణుడు మాట్లాడబోతే రాముడు ఆపుచేస్తాడు. 'వీడు మూడు వేదాలు చదువుకున్నాడు లక్ష్మణా. ఎలా మాట్లాడుతున్నాడో చెప్పమంటావా- ఈ తలకాయ, గుండె, కంఠం మూడూ సమానంగా పెట్టి మాట్లాడుతున్నాడు. కంఠం అంటే వాడు మాట్లాడే మాట. కంఠం ఒక్కటే కాదు, అక్కడ heart ఉంది, brain ఉంది. ఈ మూడూ కలిసిపోతున్నాయి. అందుకే వాడు మాట్లాడే మాట అంత wonderful గా ఉంది. ఇంత మనోహరమైన భాష, beautiful, charming, heartful భాష నీవు ఆపుచేస్తే వినే అవకాశం రాదు' అన్నాడు రాముడు.

**To err is human and to forgive is divine**: సీతమ్మతో ఆంజనేయస్వామి అన్నాడు: 'అమ్మా, నిన్ను ఎవరైతే బాధ పెట్టారో చెప్పు. నేను వారిని దండిస్తాను'. అంటే సీతమ్మ అంది: ' They are forgiven అంటే వారు క్షమించపడ్డారు'. To err is human and to forgive is divine. పొరపాటు చేయడం మనిషికి ఎంత సహజమో, క్షమించడం divinity కి అంతే సహజం. పొరపాటు చేసేది. అది క్షమించేది divinity (దైవం). ఆ మాటలో ఎంత చల్లదనం ఉందో చూడండి. Ice లో కూడా అంత చల్లదనం ఉండదు. ఆత్మ జ్ఞానం మాట అటు ఉంచండి. ముందు ఈ మాటను మనం enjoy చేయలేకపోతున్నాం.





**Attachment వలన పొరపాటు చేస్తాము:** అర్జునుడు కృష్ణుడిని అడిగాడు: 'ఏ మనిషికీ పొరపాటు చేయాలని ఉండదు. అయినా ఎందుకు చేస్తాడు?' అంటే కృష్ణుడు Attachment వలన అని అన్నాడు.

**తపన వలన జ్ఞానం కలుగుతుంది**: నాకు జ్ఞానం ఎప్పుడు వస్తుందని ఒకడు ఏసు క్రీస్తుని అడిగితే, వాడి తలను నీటిలో ముంచుతాడు ఏసు. తలను పైకి తీసి ' గాలి కోసం ఎంత బాధ పడ్డావో అంత తపన జ్ఞానం కోసం ఉంటే తప్పక జ్ఞానం లభిస్తుంది' అని అంటాడు ఏసు.



**రావణాసురునికి కామం ఎక్కువ వాలికేమో కోపం ఎక్కువ**: మండోదరి రావణాసురునితో ఏమని చెప్పిందంటే: 'మారీచుడు కూడా నీకు మంచి మాటలు చెప్పాడు, నేను కూడా చెబుతున్నాను. నీకు అసలు సీతమ్మ ఎందుకు? ఏముంది సీతమ్మలోను. సీతమ్మను తీసుకెళ్ళి అక్కడ పడేయి. నీకు కామం ఎక్కువ అందుకే సీతమ్మను తీసుకొచ్చావు'. వాలికి కోపం ఎక్కువ. రావణాసురినికి కామం ఎక్కువ. వాలి భార్య తార వాలితో అంటుంది: 'నీ తమ్ముడు మీద నీకు కోపం ఎక్కువగా ఉంది. ఎంత




ఎక్కువగా ఉందంటే నదికి వరద వచ్చినప్పుడు నీరు ఎంత వేగంగా ప్రవహిస్తుందో, నీ కోపం అంత వేగంగా ఉంది. నీకు కోపం ఎక్కువగా ఉండటం వలన రాముడు దేవుడని తెలియటం లేదు. రాముడు ఏదో నారబట్టలు కట్టుకొని కనిపిస్తున్నాడు. మానవ రూపంలో ఉన్న దేవుడు. చిటికిన వేలుతో సృష్టినే భస్మం చేసేస్తాడు. నువ్వెంత, నేనెంత. నాకు ఈ విషయం అంగదుడు చెప్పాడు'.

**ప్రారబ్ధం బలంగా ఉంటే మంచిమాటలు చెప్పినా వినరు:** భగవంతుడు అయినప్పటికీ దేహం ధరించి వస్తే కొన్ని ఇబ్బందులు తప్పవు. రామునితో వాలి అన్నాడు: 'నువ్వు పుట్టడం రాచపుట్టుక పుట్టావు కాని చేసే పని దొంగల పని చేస్తున్నావు. చెట్టు చాటు నుంచి కొట్టేపని దొంగలు చేస్తారు'. ఈ మాటల్ని రాముడు ప్రశాంతంగా విన్నాడు.



మౌనంగా ఉన్నాడు. ఉద్రేకపడలేదు. అప్పుడు రాముడు అన్నాడు: 'ప్రారబ్ధం చాలా బలీయమైనది. తార చెప్పిన మాటలు నువ్వు ఎందుకు వినలేదు? నీ ప్రారబ్ధం ఆ మాటలు విననివ్వలేదు. నేను చెట్టు చాటునుంచి కొట్టాను అని తిడుతున్నావు. ఎవరినైనా చంపగలననే అహంకారం నీలో బలంగా ఉంది. అదే నిన్ను పాడుచేసింది. నువ్వు చనిపోతావు అని తార చెప్పినా వినలేదు. నీ ప్రారబ్ధం బాగోలేక వినలేదు'. వాలి last ఘడియల్లో ఆత్మసుఖాన్ని పొందుతాడు. అప్పుడు అంటాడు: 'నువ్వు చేసిన పని నేను మర్చిపోతాను. నేను తిట్టిన తిట్లు నువ్వు మరచిపో రామా. ఆత్మసుఖాన్ని పొందుతున్నాను, ప్రశాంతంగా వెళ్ళిపోతున్నాను. నేను పొందవలసింది పొందాను. అది సరిపోతుంది'.


**ఆగ్రహం వలన నిగ్రహం కోల్పోతారు. ఆగ్రహం తగ్గించుకోవాలి, నిగ్రహం పెంచుకోవాలి**: ఆగ్రహం వలన ఎన్నో అనర్థాలు వస్తాయి. అర్జునుడి మనుమడు పరీక్షిత్ మహారాజు. నిగ్రహం లేకపోతే ఎటువంటి ప్రమాదాలు వస్తాయో చూడండి. పరీక్షిత్ మహారాజు వేటకు వెళ్ళినప్పుడు దాహంవేసి నీరు కోసమై అంగీరసుని ఆశ్రమానికి వెళ్లాడు. అక్కడ ఆంగిరస మహర్షి గాఢమైన ధ్యానంలో మునిగి ఉన్నాడు. పరీక్షిత్ మంచినీరు అడిగినా పట్టించుకోలేదు. అహంకారం రవ్వంతైనా లేకుండా ఎవరైతే జీవిస్తారో, వారెక్కడున్నా సన్యాసే. అటువంటి స్థితిలో అంగీరసముని ఉన్నాడు. పరీక్షిత్తుకి కోపం వచ్చి నిగ్రహం కోల్పోయాడు. నేనొక మహారాజుని, నన్ను నిర్లక్ష్యం చేస్తాడా? అనుకుంటున్నాడు కాని ఆయనకూ తనకూ ఎంత దూరమో గుర్తించటం లేదు. శరీరాలు




ప్రక్కప్రక్కనే ఉన్నా జ్ఞానికి అజ్ఞానికి ఎంత దూరమో. ఎందుచేతంటే చావుకి సిద్ధమైనవాడు అజ్ఞాని, చావును జయించినవాడు జ్ఞాని. దేహబుద్ధి ఉన్నవాడికి రాజు-పేద, ఎక్కువ-తక్కువ వంటి బేధభావాలుంటాయి. కాని దేహబుద్ధి దాటినవాడు జ్ఞాని. వాడికి అంతా తానే. పరీక్షిత్తు ఆగ్రహంతో నిగ్రహం కోల్పోయి పిలుస్తున్నా పట్టించుకోని అంగీరసుడిని అవమానించాలని దగ్గరిలో ఉన్న పాము కుబుసాన్ని తీసి అంగీరసుని మెడలో వేసి వెళ్ళిపోయాడు. అది అంగీరసుడు గమనించలేదు. అసలు గమనించే పరిస్థితిలో లేడు. కాని అతని కొడుకు ఇది భరించలేకపోయాడు. తన తండ్రిని అవమానించి అగౌరవపరిచినవాడు ఎంతటి వాడైనా సరే వారం తిరగకుండా పాముచేత కరువబడి మరణించుగాక అని శపించేసాడు. వాళ్ళు ఎంత దయార్థహృదయులో చూడండి. అప్పుడు అంగీరస మహర్షి తన కొడుకుతో అంటాడు: 'పరీక్షిత్తు కన్నా నువ్వే పెద్ద పొరపాటు చేశావు. రాజు ఆవేశంలో పొరపాటు చేస్తే దాన్ని మనం సవరించాల్సింది పోయి, రాజుకంటే పెద్ద తప్పు చేస్తావా? ఎవరికైనా కోపం వస్తే వాడికంటే కోపానికి గురి అయిన వాడికి ఇంకా ఎక్కువ కోపం రావడం; ఎవరైనా మనలను చూసి అసూయ పడుతూంటే వాడికంటే మనకు ఇంకా ఎక్కువ అసూయ ఉండాలనుకోవటం, తోటిమానవుల క్షేమం కోరడం తగ్గిపోవడం - ఈ లక్షణాలన్నీ కలియుగంలో కనిపిస్తాయి. కనుక కలియుగం

ఆరంభం అవ్వబోతుంది. అయినా నువ్వు శాపం ఇచ్చేసావు. దానికి తిరుగులేదు. పోనీ ఇలా శాపం ఇచ్చాను అని ఎవరితోనైనా కబురు పంపు. రాజు తన ఏర్పాట్లు తాను చూసుకుంటాడు'. అలాగే కబురు పంపితే పరీక్షిత్ మహారాజు శుకమహర్షితో భాగవతం చెప్పించుకొని, శ్రద్ధగా శ్రవణం చేసి జ్ఞానం పొంది తనువును చాలించాడు.

**God is Truth, God is pure, God is dharma, God is supreme- అని భగవంతుడి గురించి పరీక్షిత్తు దగ్గర శుకుడు వర్ణిస్తాడు**: పరీక్షితుడు శుకమహర్షిని అడుగుతాడు: 'శుకమహాషయా నాకొక శాపం ఉంది. నా శరీరం వారం రోజుల్లో చనిపోతుంది. జీవితం పొడిగించమని అడగటం లేదు. ఈ మాయలోంచి వారంరోజుల్లో బయట పడాలి. శాపం ఉంది కాబట్టి మరణం తప్పదు. ఇది ఎవరూ ఆపుచేయలేరు. దుఃఖంలేని స్థితికి, మరణంలేని స్థితికి ఈ వారంరోజుల్లో మీరు నన్ను తీసుకెళ్ళాలి. శారీరిక మరణం తప్పదు. శరీరం మరణిస్తున్నప్పటికి మరణంలేని స్థితిని ప్రసాదించండి'. అప్పుడు ముందు భగవంతుని నిర్వచనం చెప్పి, ఇట్టి దేవుడిని ధ్యానించు అని శుకమహర్షి చెబుతాడు. శుకమహర్షి అంటాడు: 'భగవంతుడు మసిలేని వాడు, ఆనందాన్ని ప్రసాదించేవాడు, పరమపవిత్రుడు. వాడే సత్యం, వాడే ధర్మం. వాడిని విడిచి ధర్మం అంటూ వేరుగా ఏమీలేదు. భగవంతుడు సత్యమా లేక సత్యమే భగవంతుడా అంటే సత్యమే భగవంతుడు. భగవంతుడికి దుఃఖస్పర్శ కూడా లేదు. దుఃఖం అంటే ఎలా ఉంటుందో తెలీదు. అందుచేత వాడిని ధ్యానం చేస్తుంటే దుఃఖం తగ్గిపోతుంది. నేను ఆనందంగా ఉన్నానని నువ్వు అనుకోవచ్చు. భగవంతుడు ఆనందంగా ఉండటం కాదు, ఆయన స్వరూపమే ఆనందం. నిప్పుకి వేడి సహజం. అలాగే భగవంతుడికి ఆనందం సహజం. అంతేకాని ఆనందంగా ఉండటం కాదు. నిప్పుని వేడి విడిచిపెట్టి ఉండదు. అలాగే భగవంతుడిని ఆనందం విడిచిపెట్టి ఉండదు. దుఃఖం ఎలా ఉంటుందో తెలియనివాడిని ధ్యానిస్తే నీకు దుఃఖం పోతుంది'.






**బలి శిరస్సు పై తన పాదం పెట్టి నేను అనే తలంపు suffering లేకుండా తీసేసాడు విష్ణువు:** వామనుడు బలిచక్రవర్తిని 3 అడుగుల నేల దానం ఇమ్మంటే, బలి గురువు వచ్చి: ' వచ్చిన వాడు విష్ణువు; వాడికి దానం ఇవ్వద్దు' అంటాడు. కాని బలిచక్రవర్తికి giving habit ఉంది. వామనుడు ఒక అడుగు భూమి మీద పెట్టి, రెండో అడుగుతో ఆకాశం పై పెట్టి, మూడో అడుగు ఏమి చేయను? అని బలిచక్రవర్తిని అడుగుతాడు. అప్పుడు బలి తన శిరస్సు వంచి 'నా తలపైన పెట్టు' అంటాడు. ఆ తలపైన నేను అనే తలంపు ఉంది. అది తీసేసాడు విష్ణువు. విష్ణువుకు బలిమీద దయకలిగి ఈ నేను అనే తలంపు తీసేయడానికి ఈ పన్నాగం పన్నాడు. మనం విచారణలు చేసి తల బద్దలు కొట్టుకొంటున్నాం. కాని బలి శిరస్సు పై తన పాదం పెట్టి ఆ తలంపు తీసేసాడు విష్ణువు. suffering లేకుండా తీసేసాడు.



**Suffering కూడా సాధనే**: అక్రూరుడు కృష్ణుడిని తీసుకురావడానికి బృందావనం వెళ్తాడు. అప్పుడు గోపికలంటారు: 'ఏదేమిటయ్యా నువ్వు చేసే పనులు క్రూరమైనవి. అసలు నీ పేరు అక్రూరుడు అని ఎలా పెట్టారు?' అని వాళ్ళ తల్లిదండ్రులను కూడా తిట్టారు. separation వల్ల suffering వచ్చింది. గోపికలకు ఒక విషయం తెలియటం లేదు- Suffering కూడా సాధన అని. ఆ separation కూడా సాధన. It is a part of సాధన.

**Practice Love**: ఈ మధ్య ఎవరో పుస్తకం తెచ్చి ఒక slogan వ్రాసిమ్మన్నారు. 'Practice Love' అని వ్రాసిచ్చాము. భగవంతుడిని ఏమీ అడక్కుండా మనం Love ని Truth ని practice చేస్తే సత్యం మనకు గోచరిస్తుంది. ఒక great quality practice చేస్తుంటే అహంభావనకు ఆలంభన ఉండదు. అప్పుడు food supply cut అయిపోయి నశించిపోతుంది. భగవాన్ అన్నారు: 'ఇతరులు ఎంత చెడ్డవారైనా ద్వేషం పెట్టుకోవద్దు'. ఇది చిన్న విషయం అనుకుంటాం కాని practice చేస్తే ఎంతో లోతుల్లోకి తీసుకువెళ్తుంది.




**మీ body నగ్నంగా ఉంటే ఎలా ఉంటుందో అలా mind కూడా ఉంటే జ్ఞానం వస్తుంది**: గోపికలు బట్టలు గట్టుమీద పెట్టుకుని నదిలో స్నానం చేస్తున్నారు. కృష్ణుడు వచ్చేసి బట్టలను మూటకట్టి చెట్టుమీద పెట్టుకుని కూర్చున్నాడు. వాళ్ళు మా బట్టలు ఇచ్చేయమని అడిగారు. గట్టు మీదకు వస్తే ఇస్తానన్నాడు కృష్ణుడు. వారికి దేహాభిమానం ఉంటుంది కదా, మేము రాము అని అన్నారు. 'మీ body నగ్నంగా ఉంటే ఎలా ఉంటుందో అలా mind కూడా ఉంటే జ్ఞానం వస్తుంది. చేరువులోంచి గట్టుమీదకు రావటానికి దేహాభిమానం అడ్డువస్తుంది. దేహాభిమానం ఉన్నవాడికి ఆత్మజ్ఞానం కలుగదు' అన్నాడు కృష్ణుడు.




**ధర్మాధ్యక్షః, లోకాధ్యక్షః, సురాధ్యక్షః కృతాకృతః** : ఇది విష్ణుసహస్ర నామాలలో వస్తుంది. ఈ లోకానికంతా ఒక ప్రభువు ఉన్నాడు. ఎవరిని, ఎక్కడ, ఎప్పుడు, ఎంతకాలం ఉంచాలో, లోకాన్ని జీవకోటిని నియమించే ఒక ప్రభువు ఉన్నాడు. వాడే **లోకాధ్యక్షుడు**. నీవు చెప్పేదంతా ధర్మం కాదు. భగవంతుడు ఏది సత్యం, ఏది అసత్యం, ఏది నిత్యం, ఏది అనిత్యం అని చెప్పిందంతా ధర్మం. **వసుమనాహ**: బంగారం వంటి మనస్సు ఉన్నవాడు చెప్పాలి. ఎవడికైతే బంగారం లాంటి మనస్సు ఉందో వాడికే ఇది ధర్మం ఇది అధర్మం అని తెలుస్తుంది కాని కపటంతో కూడి ఉన్నవాడికా ధర్మాధర్మాలు తెలిసేది? ధర్మాధర్మాలు తెలిసినవాడే **ధర్మాధ్యక్షుడు**. ధర్మాధర్మాలు తెలియాలంటే ఎంతో సూక్ష్మబుద్ధి ఉండాలి. అప్పుడు కాని ధర్మ సూక్ష్మాలు తెలియవు. అందుచేత ఆయన చెప్పింది చేయాలి, వద్దన్నది మానేయాలి. ఎందుచేతంటే ఏది మంచో ఏది చెడో మనకు తెలీదు. మనకు అంత సూక్ష్మ బుద్ధి లేదు. **సురాధ్యక్షః**- మనలనే కాదు, ఋషులను యోగులనే కాదు, ఇంద్రాది దేవతలను పాలించేవాడు. ఎవరిని ఎక్కడ నియమించాలో నిర్ణయించే న్యాయనిర్ణేత ఈశ్వరుడు. ఇంద్రుడు కంటే పెద్దవాడు. అంటే మామూలు మానవుల కంటే దేవతలు, దేవతలలో ఇంద్రుడు పెద్దవాడు. ఆ ఇంద్రుడు కంటే పెద్దవాడు ఈశ్వరుడు. అందుకే ఉపేంద్రుడు అంటారు. **కృతాకృతః** - మనకు ఏదైనా రోగం వస్తే దానికారణం ఒకోసారి Xray కి కూడా

అందదు. కార్యం స్థూలంగా ఉంటుంది, కారణం సూక్ష్మంగా ఉంటుంది. రోగాలు, చావులు, భూకంపాలు, సునామీలు, తుఫానులు ఈశ్వరుడికి తెలియకుండా రావు. రావటానికి వీలులేదు. ఎందుకంటే ప్రకృతి కూడా ఈశ్వరుని చేతిలో ఉంటుంది. science కూడా ఏమి చేయలేదు. మన brain ఎంత? దానితో సేకరించిన science ఎంత? సమాజ రూపంలో ఉన్న వాడూ ఆయనే. మంచిచేసిన వాడికి మంచి ఫలితం, చెడు చేసిన వాడికి చెడు ఫలితం- ఈ కర్మరహస్యం అంతా తెలిసిన వాడు ఆయన ఒక్కడే. మనకు కనపడని వాడు ఆయనే, కనిపించేవాడు ఆయనే. **చతురాత్మా** అని మహావిష్ణుకి సహస్ర నామాల్లో ఒక పేరు. అంటే ఎవరికీ ఎంత ఫలం ఇవ్వాలో ఆ ధర్మసూక్ష్మం తెలిసినవాడు. కాబట్టి చతురుడు. అంత skill కలవాడు. భగవంతుడికి planning తెలుసు. ఆ planning ను ఎలా అమలుపరచాలో కూడా బాగా తెలిసినవాడు.






**భగవంతుని ప్రేమను తల్లి ప్రేమతో కూడా పోల్చటానికి వీలు లేదు**: అది కురుక్షేత్ర మహారణరంగం. ఎవరు ఎక్కడ ఉంటారో చెప్పలేము. ధర్మరాజు దొరికేస్తున్నాడు అని సైనికులంతా ఒక్కసారిగా అరిచారు. కృష్ణార్జునులు ఎక్కడో ఉన్నారు. అర్జునుడి చెవికి ఈ కేక వినబడలేదు. కృష్ణుడు శరవేగంతో రథం తోలి కౌరవ చేతికి ధర్మరాజు చిక్కకుండా అర్జునిడితో యుద్ధం చేయించి పాండవులను రక్షించాడు.కనుక భగవంతుని ప్రేమను తల్లి ప్రేమతో కూడా పోల్చటానికి వీలు లేదు.



**ధర్మో రక్షతి రక్షితః** - ఇది తిరుమల తిరుపతి దేవస్థానం వారి నినాదం. భగవంతుడు అందరికి తలా ఒకపని కేటాయిస్తాడు. మన పరిధిలో మనవంతుకు ఏ పనైతే కేటాయించాడో ఆ పనిని అయిష్టంగా కాక ఇష్టంగా చేస్తే వాడు ధర్మాన్ని ఆచరిస్తున్నట్లు గుర్తు. ధర్మం మీద గౌరవం ఉండి ధర్మాన్ని ఆచరించే వాడిని ధర్మం రక్షిస్తుంది అంతేకాని ధర్మం మీద గౌరవం లేని వాడిని ధర్మం రక్షించదు. కృష్ణుడు అంటే ధర్మస్వరూపుడు. అటువంటి కృష్ణుడు కర్ణుని రథం కూరుకుపోయి తీసుకుంటూ ఉంటే, అర్జునితో ' ఇదే సమయం కర్ణుడిని కొట్టేయి' అని అంటాడు. 'ఇది నీకు ధర్మమా' అంటాడు కర్ణుడు. 'నీకు అసలు ధర్మం యందు గౌరవం ఉందా? నిండు సభలో ద్రౌపదిని అవమానపరుస్తూంటే ఇది ధర్మం కాదని చెప్పలేకపోయావు, చూస్తూ ఊరుకున్నావు. ధర్మాన్ని కాపాడలేదు. నువ్వు ధర్మాన్ని ఆచరిస్తే అర్జునుడు ఎవరు? నేను ఎవరు? ఆ ధర్మమే నిన్ను రక్షిస్తుంది' అన్నాడు పరమాత్మ. అందరి విషయంలో అధర్మంగా ప్రవర్తించి సొంత విషయం వచ్చేసరికి ధర్మం, న్యాయం అంటే ఎలా కుదురుతుంది అన్నది కృష్ణుని ఉద్దేశ్యం.




**మంచానికి నాలుగు కోళ్ళ వంటిది కర్మయోగం:** తిలక్ గారు కర్మయోగం గురించి వ్రాసారు. మంచానికి నాలుగు కోళ్ళ వంటిది కర్మయోగం. ఏ కోడు లేకపోయినా మంచం నిలువదు. కృష్ణ పరమాత్మ గీతలో అన్నాడు: 1) పని చేయి 2) ఫలితాన్ని ఆశించకు 3) ఫలమేదైనా హేతువు కాకు 4) ఇన్ని షరతులు పెట్టానని అసలు పనే విడిచి పెట్టకు.

**దుఃఖం నశించటానికి formula:** మీకు నిజంగా దుఃఖం వస్తున్నా, ఎవరికో దుఃఖం వస్తుంది వాడు మాత్రం నేను కాదు అని అర్థం చేసుకోండి. దుఃఖం అంతా నశిస్తుంది. ఉదాహరణకు పక్కింటి వారి దుఃఖం మీది కాదు కదా. అలాగే మీ దుఃఖాన్ని కూడా వేరుగా చూడండి. మోక్షం వచ్చేంత వరకు దుఃఖం ఉంటుంది. అయితే మీకు దుఃఖం వస్తున్నా, మీరు దుఃఖ పడుతున్నా ఆ దుఃఖపడేవాడు మీరు కాదు. ఇది అర్థం అయితే దుఃఖం నశించి జ్ఞానం వస్తుంది. మోక్షం వచ్చే వరకు భయం ఉంటుంది. అయితే ఎవ్వరినీ భయపెట్టకుండా ఎవరికీ భయపడకుండా ఉండటానికి ప్రయత్నించాలి. ఈశ్వరుడిని స్మరిస్తూ ఉండాలి. ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నం చేస్తూ ఉండాలి. పథ్యం, మందు లాగా రెండూ ఉండాలి.




**కతృత్వరహితుడు మాత్రమే కర్మని యోగంగా చేయగలడు**: సురేంద్రనాథ్ బెనర్జీ Calcutta meeting లో మాట్లాడుతుంటే ప్రేక్షకులనుంచి ఎవరో చెప్పు విసిరారు. ఆ చెప్పు తనమీద పడేసరికి అవమానం భరించలేక ఆయన కంటివెంట నీరు వచ్చాయి. ఆ చెప్పు పైకెత్తి ఆయన అన్నారు: 'భారత దేశానికి నేను 40 సంవత్సరాలు సేవ చేశాను. దానికి ప్రతిఫలంగా భారతీయులు నాకు ఈ చెప్పును బహుమానంగా ఇచ్చారు'. కర్మని యోగంగా చేస్తే ఆయన బాధపడడు. సేవచేశాడు కాని అక్కడ doer-ship ఉంది. doer-ship ఉన్నంతకాలం దుఃఖం తప్పదు. కతృత్వంతో చేసే మంచి పనులు కాని చెడ్డ పనులు కాని అజ్ఞానంలో ఉండే చేస్తారు. కతృత్వరహితుడు మాత్రమే కర్మని యోగంగా చేస్తాడు. కతృత్వసహితుడు పుణ్యానికి పుణ్యం, పాపానికి పాపం అనుభవించవలసిందే. కతృత్వం ఉన్నంత కాలం అశాంతి దుఃఖం నిన్ను విడిచిపెట్టవు.



**పిరికితనం కంటే హింస మెరుగు అన్నారు గాంధీ గారు**: అందరికి ప్రాణం అంటే తీపి. ప్రాణం పట్ల ఏమాత్రం తీపిలేనివాడు మహాత్మా గాంధీ. ఆయన ప్రాణాన్ని గడ్డిపరకతో సమానంగా చూసి అది మంచిపని అనుకున్నప్పుడు మరణం వస్తుందన్నా వెనుకడుగు వేసేవాడు కాదు. ఆయన పొట్ట ఎప్పుడూ అంటుకుపోయే ఉండేది. ప్రాణాన్ని నిలపెట్టుకోటానికే తినాలి అనే సిద్ధాంతానికి సరిగ్గా సరిపోయేవారు గాంధీగారు. పక్క ప్లేట్ వంక చూడరు. సంక్రాంతి రోజు కూడా where is my plate? అంటారు. తినటం కోసం బతకరు. బతకటం కోసం తింటారు. మనం అవసరానికన్నా ఎక్కువ తినేస్తున్నాం. నాలుకను అదుపులో పెట్టుకోవాలి. ఎందుకంటే అన్నీ ఇంద్రియాలు ఒక్క పనే చేస్తాయి కాని నాలుక మాత్రం రెండు పనులు చేస్తుంది. అర్జునుడికి సవ్యసాచి అని పేరు. ఎందుకంటే రెండు చేతులతో బాణాలు వేయగలడు. అలాగే గాంధీగారు రెండు చేతులతో అందంగా వ్రాయగలరు. సాధారణంగా కుడిచేత్తో ఎంత అందంగా రాస్తారో గాంధీగారు ఎడమ చేత్తో కూడా అంతే అందంగా వ్రాస్తారు. గాంధీ గారు అనేవారు: 'government తో పోరాటంలో మనకు తుపాకులు లేవు. ఆయుధాలు లేవు. శరీరమే ఆయుధం'. అవసరమైతే మంచి పనికోసం శరీరాన్ని త్యాగంచేయటానికి గాంధీగారు


సిద్ధపడతారు కాని వెనుతిరిగే సమస్యే లేదు. ఈ మధ్య గాంధీగారి మనమరాలు అంది: 'నోట్ల మీద, పిల్లల పాఠ్యపుస్తకాల్లో ఉన్నారు కాని మా కుటుంబంలో మాత్రం గాంధీ గారి పట్ల ఎవ్వరికీ గౌరవం లేదు. ఎందుకంటే మా కుటుంబానికి ఆయన ఏమి చేయలేదు. నేహ్రూగారి పిల్లలు మనుమలు అంతా విదేశాల్లో చదివారు. మేము government schools లో చదివాము. ఒక్క government post కూడా మాకు గాంధీగారు వేయించలేదు'. గాంధీగారు ఎంతటి నిరాడంబర జీవియో ఇక్కడ మనకి అర్థం అవుతుంది. గాంధీగారు చేసే పనులు రాజాజీకి, నెహ్రూకి నచ్చేవి కావు కాని వారు గాంధీగారిని ఎప్పుడూ విడిచిపెట్టలేదు. అలాగే మనం భగవంతుడిని, ఆయన పాదాలను ఎన్నటికీ విడిచిపెట్టకూడదు. ఉప్పు సత్యాగ్రహం చేసేటప్పుడు పిరికితనంగా భయపడేవారంతా party నుంచి నిష్క్రమించవచ్చు అని గాంధీగారు అన్నారు. గాంధీగారిని saddam hussain తో పోల్చలేము. ఉప్పు పట్టుకుంటే lathi charge చేసే సమయంలో గుప్పటిలో ఉప్పుపట్టుకొని సముద్ర ఒడ్డున ప్రశాంతంగా నిద్రపోయారు గాంధీగారు. అంతేకాని సద్దాం లా బంకర్లో దాక్కోలేదు. బ్రిటిష్ వారు గాంధీగారిని ఒక conference కి London పిలిచి ఆయనతో ఏమీ చర్చించకుండా ఈ విధంగా నిర్ణయం అయిపోయింది అన్నారు. 'ఈ మాటలు చెప్పటానికి నన్ను ఇక్కడికి పిలిపించటం ఎందుకు? ఈ చెల్లని cheque నాకెందుకు? అంటే మీరు నాతో చర్చించకుండా ఏకపక్షంగా తీసుకున్న మీ నిర్ణయాన్ని నేను ఏకీభవించను, నా ఉద్యమం నాదే' అని ధైర్యంగా బ్రిటిష్ వారికి చెప్పి తిరిగి వచ్చేసారు. గాంధీగారి ముఖ్యోపదేశం: ఒక మంచి పనిని చెడ్డ మార్గంలో చేయకూడదు. అలా చేస్తే mind pollute అయిపోతుంది. అంటే మన goal ఎంత మంచిదో మన మార్గం కూడా అంత మంచిదై ఉండాలి. గోపురం ఎక్కి చూస్తే అన్నీ చీమలే అయిపోతాయి అదేవిధంగా ఒక స్థాయికి వెళ్ళాక అక్కడ బాగుబోగులు లేవు. 'పిరికితనం కంటే హింస మెరుగు' అన్నారు గాంధీ గారు. అది మనకు ఎంత వరకు అర్థం అవుతుంది? ఆ స్థాయికి వెళ్ళినప్పుడు అర్థం అవుతుంది. గోపురం ఎక్కితే అన్నీ చీమలు అయినట్లు ఇక్కడ ఉండి చూస్తే అన్నీ ఎనుగుల్లాగే కనిపిస్తాయి. అర్థం కావు.

**రాజాజీ ని ౨౦ వ శతాబ్ధి నక్క అని అంటారు**: రాజాజీ నిర్మలంగా ఉంటాడు. ఉద్రేకపడడు, ఆవేశపడడు. మనకు ఆదర్శమైన వ్యక్తి. భక్తునిలా పైకి కనిపించడు. పైకి బొట్టులేవి పెట్టడు. ఆయనకు శివ కేశవుల బేధం లేదు. ఒకసారి పార్లమెంట్ లో ఒక MLA: ' మీరు చెప్పింది నాకు అర్ధం అవ్వటం లేదు' అంటే రాజాజీ అన్నారు: 'అసలు నేను చెప్పేమాట వినకుండా నేను నీ శత్రువు అనుకుంటే నీకేమి అర్ధం అవుతుంది?' బాపూజీ రాజాజీ వియ్యంకులు. అయినా బాపూజీ కంటే రాజాజీ కి సూక్ష్మ బుద్ధి ఎక్కువ. రాజాజీ ని ౨౦ వ శతాబ్ది నక్క అని అంటారు. భారత దేశాన్ని India పాకిస్తాన్ గా విడగొట్టాలి అని ప్రస్తావించినప్పుడు గాంధిజీ చాలా ఉద్రేకపడి: 'నా శిరస్సు నుండి శరీరాన్ని రంపం పెట్టి రెండు ముక్కలగా కోసేయండి' అన్నారు. అంటే మనం శరీరం తో ఎలా తాదాప్యం పొందుతున్నామో గాంధీజీ దేశంతో అలా తాదాప్యం పొందేవారు. ఇప్పుడు ఉద్రేకంలో ఉన్న గాంధీజీ కి చెప్పినా అర్ధం కాదని ఆ వేళ గాంధీని వదిలేసి రాజాజీ మరునాడు గాంధీ తో అన్నారు: 'పాకిస్తాన్ విభజన ఒప్పుకోకపోతే భారత దేశానికి స్వాతంత్రం రావడం late అవుతుంది'. తర్వాత గాంధీగారు ఒక్కరే జిన్నా ఇంటికి వెళ్లి: 'నీకు PM post ఇచ్చేస్తాను. ఈ దేశాన్ని రెండు ముక్కలుగా చేయకు' అని ప్రాదేయ పడ్డారు. అప్పుడు జిన్నా అన్నాడు: 'నేను ఇప్పటివరకు muslims కు వేరే దేశం ఇస్తానని ఇక్కడి దాకా తీసుకొచ్చాను. ఇప్పుడు మాట తప్పితే నా పరువు పోతుంది'. గాంధీ గారిని కాల్చి చంపినప్పుడు జిన్నా చంటిపిల్లాడిలా ఏడ్చాడు. 'రంపం పెట్టి కొయ్యండి' అన్నమాట గాంధీగారి దేశభక్తికి గుర్తు. పటేల్ చనిపోయినప్పుడు రాజాజీ నెహ్రూ తో అన్నారు: 'ఆయన చనిపోయాడు. ఇంకా నువ్వున్నావు'. దాని అర్ధం ఏమిటంటే: 'ఇప్పటిదాకా మీరిద్దరూ దేశం బరువు మోస్తున్నారు. ఇకనుండి నువ్వే మోయాలి' అని చెప్పడం. రాజాజీ అనేవారు: 'ద్వేషాల గొడవ, రాగాల గొడవ వదిలేయి. నీ సాధనేదో నువ్వు చూసుకో'. 'పలానా వారు గొప్పవారు' అనేటువంటి మాటలు రాజాజీ ఒప్పుకోరు. 'ఎవరి పని వారు శ్రద్ధగా చేసుకోండి. collector గారి పని collector చేసుకుంటాడు. మీ పనేదో మీరు శ్రద్ధగా చూసుకోండి' అనేవారు రాజాజీ. రాజాజీకి చాలా భక్తి ఉండేది కాని అది చాలా రహస్య భక్తి. గాంధీగారికి ఎప్పుడన్నా emotion వచ్చేది. రాజాజీకి ఎన్నడూ emotion లేదు. దేశ విభజన విషయంలో ' పాకిస్తాన్ ఇచ్చి పడేయండి గోల ఉండదు' అన్నారు. పది రోజుల్లో చనిపోతారు అనగా రాజాజీని ' ఎలా ఉన్నారు?' అని అడిగితే: 'సుఖంగా వెళ్లి పోతున్నాను. దుఃఖంగా వెళ్ళడం లేదు' అన్నారు.







**లోకం అతిమంచితనాన్ని భరించలేదు**: నాకు బుద్ధుడు, భగవాన్, గాంధీగారి కంటే లింకన్ అంటే ఎక్కువ ఇష్టం. ఆయన అమెరికా ప్రెసిడెంట్ పదవికి చాలాసార్లు పోటీచేసి ఓడిపోయారు. 'మీకు బెంగాలేదా?' అని ఆయన్ని అడిగితే: 'ఓడిపోటానికి అలవాటు పడినవాడికి బెంగ ఏమిటి?' అనేవారు. అయితే ఆయనలో ఔన్నత్యం ఎక్కడ ఉందంటే ఎన్నిసార్లు ఓడిపోయినా ప్రజలమీద కోపంగాని, ద్వేషంగాని, శత్రుత్వంగాని రాలేదు. అలా ప్రేమిస్తూనే ఉండేవాడు. 'నెగ్గటం, ఓడిపోవటం నా ప్రారబ్ధం. మీరు సంతోషంగా ఉండాలి. నన్ను గెలిపించకపోయినా మీరు బాగుపడటం ముఖ్యం' అని ప్రేమిస్తూనే ఉండేవారు. గాంధీగారిలాగే ఆయన్ని కాల్చిచంపారు. ఆయన బానిసత్వాన్ని ఎదిరించారు. 'వారు మనలాంటి వారే. వారితో వెట్టిచాకిరి చేయించడం ఏమిటి? బజారులో వస్తువులు కొనుక్కున్నట్లు మనుష్యులను పనికోసం కొనుక్కోవడం అమానుషం' అని పోరాడేవారు. అది గిట్టనివారు ఆయన్ని ఒక డ్రామాకి ఆహ్వానించి డబ్బిస్తే చంపేసే వారితో కాలిపించి చంపించేసారు. పదవి ఉండగానే చంపించేసారు. లోకం అతిమంచితనాన్ని భరించలేదు.



**ఇతరుల పట్ల ప్రేమగా ఉంటేనే మనం ఏదైనా ఎవరికైనా ఇచ్చినా వాళ్ళూ సుఖపడతారు, మనమూ సుఖపడతాము:** ఒకసారి నాలుగవ తరగతి చదివే అమ్మాయి లెక్కలు చెప్పమని ఐంస్టీన్ దగ్గరకు వచ్చింది. చెబుతాను, కాని నాకు జీతం ఎంత ఇస్తావు? అని అడిగారు ఐంస్టీన్. పిల్లలు ఎంత స్వచ్ఛంగా ఉంటారో చూడండి. అందుకే పిల్లలు దేవునితో సమానం అని అంటారు. 'మా నాన్న వారానికి ఒక డాలర్ ఇస్తారు. అందులో 75 స్సెంట్స్ మీకు ఇస్తాను' అన్నది ఆ అమ్మాయి. అలాగే అని ఆయన రోజూ ఆ అమ్మాయికి లెక్కలు చెప్పడం మొదలు పెట్టారు ఐంస్టీన్. ఈ విషయం ఆ అమ్మాయి ఇంట్లోవారికి తెలిసింది. అంతపెద్ద ఆయనతో లెక్కలు చెప్పించుకుంటోంది అని ఆ అమ్మాయి వాళ్ళ నాన్నగారు ఐంస్టీన్ కు క్షమాపణ చెపుదాం అని వెళ్లారు. ' మా అమ్మాయికి తెలియక మీ దగ్గరికి వచ్చేస్తుంది' అని అన్నారు. ఐంస్టీన్ అన్నారు: తనకు చదువు ఎలా చెప్పకుండా ఉంటాను? **50%** కాదు, **75%** తన దగ్గరున్న ధనంలోంచి నాకు ఇచ్చేస్తుంది. ఎంతోమంది నన్ను ఎన్నో విధాలుగా గౌరవించారు, సన్మానించారు. purse లో డబ్బులు పెట్టి ఇచ్చారు. కాని మీ అమ్మాయి ఆధరించినట్లుగా ఎవరూ ఆధరించలేదు. ఏ వ్యక్తి తన ఆధాయంలో మూడోవంతు తెచ్చి ఇచ్చినవారు ఇంతవరకూ ఎవరూ లేరు. ఇదిగో మీ అమ్మాయి ఇచ్చిన డబ్బంతా జాగ్రత్తగా దాచుకున్నాను'. ఐంస్టీన్ 75 స్సెంట్స్ చూసి చెప్పలేదు. ఆయనకు డబ్బు లోటేమిటి? ఆ పసిహృదయం చూసి, ఆ స్వచ్ఛత చూసి చెప్పాడు. అంత ప్రేమ ఉంటే కాని ఎవరికీ న్యాయం చేయలేము. ఐంస్టీన్ ఎంత ప్రేమగా చెప్పాడో, అంతప్రేమగా ఇతరుల పట్ల ఉంటేనే మనం ఏదైనా ఎవరికైనా ఇచ్చినా వాళ్ళూ సుఖపడతారు, మనమూ సుఖపడతాము. ఇచ్చినవాడు శాంతిగా ఉంటాడు, పుచ్చుకున్నవాడు శాంతిగా ఉంటాడు. అంతప్రేమగా చెబితే నేర్చుకున్నవాడు శాంతిగా ఉంటాడు, నేర్పినవాడికి శాంతి వస్తుంది.


**భగవంతుడి ప్రణాళిక బాగుందా? లేక విమానాల ఉద్యోగం బాగుందా?:** రాష్ట్రపతి కలాం గారికి విమానాలు నడపడం ఇష్టం. Dehradun interview కి వెళ్లారు. Merit list లో 11 వ వాడిగా select అయ్యాడు. 10 వరకు jobs ఇచ్చారు. ఆ బాధ తట్టుకోలేక కలాం గంగా నదిలో స్నానం చేసి స్వామి శివానంద దగ్గరికి వెళ్ళారు. శివానంద గారు కలాంతో అన్నారు: ' అబ్బాయి నువ్వు అలా ఏడుస్తూ కూర్చోకు. నాలుగు రోజులు ఆశ్రమంలో ఉండు. subject తెలియక అలా దుఃఖ పడుతున్నావు. భగవంతుడు నీ శరీరం ద్వారా ఏ పని చేయించుకోవాలి అనుకుంటున్నాడో ఆ పని చేయించుకుంటాడు. రాబోయే ఉద్యోగంలో చేరు'. అప్పుడు delhi లో junior scientist గా join అవ్వడం, గొప్ప గొప్ప politicians తో పరిచయం అవ్వడం, చివరికి రాష్ట్రపతి అవ్వడం జరిగింది. భగవంతుడి ప్రణాళిక బాగుందా? లేక విమానాల ఉద్యోగం బాగుందా? కలాం పొద్దున్న 6 గంటలకు పని ప్రారంభించే వారు. 'కలాం మీరు చాలా బాగా పని చేస్తున్నారు' అని ఎవరైనా అంటే ' ఆ మాటలు నన్ను కర్ర పెట్టి కొట్టినట్లు ఉండేవి' అనేరు కలాం. 'అది నా duty' అని అనేవారు. 'ఇంట్లోనే బండెడు చాకిరీ చేస్తున్నాం కాని ఎవ్వరూ గుర్తించటం లేదు' అని మనం గుర్తింపు కోరుకుంటాం. కాని కలాం గారికి అలా గుర్తింపు అక్కర్లేదు. మనం గుర్తింపులు కోరుకుంటే దేహాభిమానం పెరుగుతుంది. భగవంతుడు మనకు కేటాయించిన పనిని duty గా చేయాలి.

**ఆచార్యుల వారు 'అర్థం అనర్థం' అన్నారు**: మనిషి బ్రతకటానికి డబ్బు అవసరం. ఒక స్థాయిని మించిపోయిన డబ్బు ఆ మనిషికి అనర్థాన్ని తీసుకొస్తుంది. అవసరానికి మించిన డబ్బు అనర్థాన్ని తీసుకొస్తుంది. ఈ ధనం భోగప్రవృత్తి కలుగజేస్తుంది. పైకి బాగానే ఉంటాడు కాని లోపల కుళ్ళిపోతూ ఉంటాడు. ఇది ఇక్కడ వచ్చిన ప్రమాదం.






**శివ కేశవుల మధ్య బేధం లేదు**: ఒకసారి కంచి పరమాచార్యుల దగ్గరికి ఒక భక్తుడు వచ్చి 'మేము కొత్త ఇంటికి ఏమి పేరు పెట్టాలి?' అని అడిగితే, పరమాచార్య 'గురుకృప' అని పెట్టమన్నారు. ఆయనకు విభూతి, కుంకుమ ఇచ్చారు పరమాచార్య. 'విభూతి అలవాటు లేదు' అని ఆయన అంటే ' ఇంత pleader చదువు చదివి శివ కేశవుల మధ్య బేధం చూస్తున్నావా?' అని పరమాచార్యులు ఆయన్ని మందలించారు.



**నేను తలపెట్టుకుంటేనే మీరు తలపెట్టుకుంటారా? నేను మరచిపోతే మీరూ మరచిపోతారా? అది న్యాయమా? అది జ్ఞానమా?**: ఒక foreignor కొంతకాలం ఆశ్రమంలో ఉండి london వెళ్ళిపోతూ: 'చాలా దూరం వెళ్ళిపోతున్నాను భగవాన్. మీరు నన్ను తలపెట్టుకోవాలి' అన్నది. దానికి భగవాన్ అన్నారు: 'If you remember Bhagavan, Bhagavan will remember you. నువ్వు నన్ను తలపెట్టుకుంటే నేను నిన్ను తలపెట్టుకుంటాను.' రెండు చేతులు కలిస్తే చప్పట్లు, రెండు హృదయాలు కలిస్తే ముచ్చట్లు. నేను చూస్తాననుకో నీవూ నా వంక చూడాలి కదా. నేను తలపెట్టుకుంటాను మరి నీవు తలపెట్టుకోవాలి కదా' అని తిరకాసు పెట్టారు భగవాన్. అప్పుడు ఆ foreignor అంది: 'నాది మనస్సు. నేను మనోపరధిలో ఉన్నాను. మనస్సు బాగున్నప్పుడు తలపెట్టుకుంటాను. మనస్సు బాగోనప్పుడు మరచిపోతాను. మీరు మనస్సా, నాతో పోల్చుకుంటారేమిటి?' ఈ అమ్మాయి మన తరపు అమ్మాయే. ' నాకు మనస్సు, శరీరం, బుద్ధి ఉన్నాయి కనుక తలపెట్టుకోవచ్చు, తలపెట్టుకోకపోవచ్చు. మరచిపోవటం, తలపెట్టుకోవటం- రెండూ మనస్సులోనే ఉన్నాయి. వీటితో సంబంధం లేకుండా మీ హృదయంలో నాకు కొంత చోటు ఇవ్వండి చాలు. నేను తలపెట్టుకుంటేనే మీరు తలపెట్టుకుంటారా? నేను మరచిపోతే మీరూ మరచిపోతారా? అది న్యాయమా? అది జ్ఞానమా?

**మనకు బాగుపడే యోగం ఉన్నప్పుడే ఈశ్వరుడి పట్ల గురువు పట్ల ప్రేమ కలుగుతుంది**: ఒకసారి పరమహంస 'అస్తమానం నా దగ్గరికి ఎందుకు వస్తున్నావు నరేన్?' అని అడిగారు. 'నాకు మీ మీద ప్రేమ కలుగుతోంది. అందుకే వస్తున్నాను' అన్నాడు నరేన్. దానికి పరమహంస అన్నారు: 'నీకు బాగుపడే యోగం ఉంది అందుకే నా పట్ల ప్రేమ కలుగుతోంది లేకుంటే నీకు నా పట్ల ప్రేమ ఎందుకు కలుగుతుంది?'



**ఎప్పుడూ ఒకరితో పోల్చుకోకూడదు**: ఒక మంచివాడు తాను మంచివాడని మనస్సులో అనుకున్నా చాలు slow గా superiority complex మొదలై వాడు సుబ్బరంగా పాడైపోతాడు. అందుకే ఎప్పుడూ ఒకరితో పోల్చుకోకూడదు. ఒకసారి స్వామి వివేకానందని 'మీరు మీ గురువుగారైన పరమహంస లా ఉండరేంటి?' అని అడిగారు. స్వామీజి అన్నారు: 'పరమహంస గారు అమ్మా కాళి! అమ్మా కాళి! అని అంటూ ఉంటారు. నేను దేశమంతా తిరిగే వాడిని. ఆయనలా ఎలా ఉంటాను? ఆయన చిన్న తుండు గుడ్డ కట్టుకుంటారు. దేశసంచారిని అది నాకెలా కుదురుతుంది? ఆయనలా నేనుంటే అది నా తప్పు. నాలా ఆయన ఉంటే అది ఆయన తప్పు. నాలా మా గురువు, మా గురువులా నేను ఉండకూడదు. ఆయన ఆయనే; నేను నేనే' అన్నారు స్వామి వివేకానంద.




**భగవంతుడు ఉన్నాడు లేక లేడు అని చెప్పటం సాపేక్షం** : హృదయం లేకపోతే మనస్సు లేదు. మనస్సు లేకపోతే శరీరం లేదు. శరీరం లేకపోతే లోకం లేదు. లోకం లేకపోతే దేవుడు కూడాలేడు. అందుచేత మనస్సు ఎప్పుడైతే హృదయం లో అణిగిపోయిందో అది కల్పించుకున్నవి అన్నీ కూడా పోతాయి. దేవుడు కూడా మనస్సు యొక్క కల్పితమే. అందుకే మనస్సు అణిగి పోయినప్పుడు దేవుడి గొడవ కూడా ఉండదు. బుద్ధుడిని అందరూ అపార్థం చేసుకున్నారు. బుద్ధుడిని ఎవరైనా దేవుడున్నాడా? అని అడిగితే మాట్లాడే వాడు కాదు. మౌనం వహించే వాడు. దేవుడు లేడా? అని అడిగినా మౌనం వహించేవాడు. కారణం నిత్యానికి అనిత్యానికి ఆధారంగా ఏదో ఉంది. దాన్ని తెలుసుకోవాలి అనుకున్నాడు, అదే అందరిని తెలుసుకోమన్నాడు. ఉన్న సత్యం ఉండటానికి లేకపోవటానికి అతీతంగా ఉంది. భగవంతుడు ఉన్నాడు లేక లేడు అని చెప్పటం సాపేక్షం. ప్రకృతి భౌతికం, లౌకికం. సత్యం వీటన్నిటికీ అతీతంగా ఉంది. అందుకే మౌనం వహించేవాడు బుద్ధుడు. ఉన్నది అని చెబితే ప్రకృతికి పరిమితం. లేదు అని చెబితే- ఒకప్పుడు ఉన్నది ఇప్పుడు లేదు అనే అర్థం వస్తుంది. అందుచేత అదీ ప్రకృతే. కాని సత్యం అనేది ప్రకృతికి ఆధారంగా అతీతంగా ఉంది.



**మనస్సులో కల్పించుకున్నవి అన్నీ పోతే కదా లోపల ఉన్నది (బంగారం) దొరికేది**: మంచి చేసిన వాడికి దుర్గతి లేదు అంటే మంచి చేసి చేసి ప్రకృతిని వదిలేస్తాడు. ప్రకృతిని వదలకుండా ఏ జీవునికి జ్ఞానం రాదు. అందుకే వివేకానంద అంటాడు: పైన ఉన్నది పోతే కదా లోపల ఉన్నది దొరికేది. అంటే మనస్సులో కల్పించుకున్నవి అన్నీ పోతే కదా లోపల ఉన్న బంగారం దొరికేది అని అర్థం. ఒకసారి mysore మహారాజ దగ్గరికి వివేకానంద వెళ్ళినప్పుడు 'మా దీవాన్ గురించి మీ అభిప్రాయం ఏమిటి?' అని అడిగారు. అప్పుడు స్వామిజి: 'మీ దీవాన్ ఏమైనా లోకోద్ధారకుడా? దేశానికి ఏమైనా చేశాడా? పేద ప్రజలందరి దగ్గర కప్పం వసూలు చేసి delhi వెళ్లి viceroy కి కట్టి వస్తున్నాడు. ఆయన ఏమైనా రాముడా కృష్ణుడా? దేవుడని చెప్పమంటారా?' అని అన్నారు. మీ దీవాన్ చాలా గొప్పవాడు అని వివేకానందుడు అంటాడు అని మహారాజు అనుకున్నాడు. కాని ఇలా విపరీతంగా మాట్లాడే సరికి వివేకానందుని పక్కకు తీసుకెళ్ళి మహారాజు అన్నారు: 'దీవాన్ అంటే ప్రధానమంత్రి తో సమానం. ఆయన్నీ అలా అనకూడదు. ఎవరైనా వింటే బాగుండదు'. అంటే స్వామిజి అన్నారు: 'మీ దీవాన్ గొడవ నాకెందుకు? మీరే మొదలు పెట్టారు. ఎవరైనా వింటే ఏమౌతుంది?' 'చంపినా చంపేస్తాడు లేక చంపించేస్తారు' అన్నారు mysore మహారాజు. 'దానికి సిద్ధంగా ఉన్నాను' అన్నారు స్వామిజి. అదివిని మహారాజు అవాక్కయ్యారు. 'ఎవడో చంపేస్తాడని వంటింట్లో ఏమి దాక్కుంటాను? చావుకి భయపడి మీరు చెప్పిన దానికల్లా తానా అంటే తందనానా అనవలసిన పని నాకేమిటి?' అని నిర్భయంగా అన్నారు స్వామీజీ.

**దేహానికి జబ్బు చేస్తుంది కాని స్వరూపానికి జబ్బు చేస్తుందా?:** రామకృష్ణుడు చివరి రోజులలో Cossipore gardens లో ఎనిమిది నెలలు ఉన్నారు. మధ్యానం రెండు గంటలు తప్పించి మిగతా time లో భక్తులు వచ్చి చూసి వెళ్ళేవారు. కొందరు రామకృష్ణుడికి infection వస్తుంది అనేవారు. ఆ మాటలు రామకృష్ణులు విని అన్నారు: ' దేహానికి infection వస్తుంది కాని స్వరూపానికి infection వస్తుందా?' దేహానికి జబ్బు చేస్తుంది కాని స్వరూపానికి జబ్బు చేస్తుందా? అనేవారు.




**గురువంటే బురదపాము కాదు, మింగేస్తాడు:** రామకృష్ణపరమహంస ఒకసారి తన కాలు తీసి నరేన్ నెత్తిమీద పెట్టారు. ఆ క్షణంలో దేహం మనస్సు నేనుకాదు అని హృదయంలోకి నెట్టబడిపోతున్నాడు నరేన్. 'ఏమిటి ఆచార్యా నాకు ఇంటిదగ్గర బాధ్యతలు ఉన్నాయి. నా తల్లి, తమ్ముళ్ళు నా మీద ఆధారపడి ఉన్నారు. నన్ను నాకు కాకుండా చేస్తున్నారు' అని కలవరించాడు నరేన్. 'మృత్యువు గుహలోకి, మృత్యువు యొక్క అంచులకు తీసుకుపోతున్నారా ఆచార్యా?' అంటాడు నరేన్. అప్పుడు పరమహంసగారు 'సరిపోతుంది' అని చెప్పలేదు. 'ఇప్పటికి ఇది సరిపోతుంది' అన్నారు. గురువనుగ్రంలో పడినవాడు తరించి తీరుతాడు. గురువంటే బురదపాము కాదు, మింగేస్తాడు.



**స్వార్థం కోసం కాకుండా ఇతరులను పవిత్రం చేయటం కోసం క్రీస్తు తన రక్తాన్ని sacrifice చేశాడు కాబట్టి అది good friday అయ్యింది**: ఈ రోజు good friday.ఈ రోజు యేసుక్రీస్తు శిలువ వేయబడిన రోజు. ఒక మనిషి శిలువ వేయబడిన రోజు good friday అవుతుందా లేక bad friday అవుతుందా? అయితే good friday అనే అంటారు. వచ్చేవారం పునరుద్ధరణ. ఆ రోజు సమాధిలోంచి బయటకు వచ్చి అక్కడ ఉన్న భక్తులతో మాట్లాడుతాడు. అప్పుడు ఆ భక్తులంటారు: 'నీవు చనిపోయావు కదా; ఎలా తిరిగి వచ్చావు? నిన్ను కప్పెట్టివేశాము కదా?' అన్నారు. క్రీస్తు అప్పుడు తన చేతితో వారిని touch చేస్తాడు. అది ఆదివారం జరుగుతుంది. క్రీస్తు తన స్వార్థం కోసం కాకుండా ఇతరులను పవిత్రం చేయటం కోసం, ఇతరుల మేలు కోసం తన రక్తాన్ని sacrifice చేశాడు కాబట్టి అది good friday అయ్యింది. ఇతరులను పవిత్రం చేయటం కోసం తన శరీరాన్ని త్యాగం చేశాడు యేసు. యేసు అంటాడు: 'మీరు మంచం కొనుక్కో గలరు కాని నిద్రసుఖాన్ని కోనుక్కోగలరా?' మంచి మంచం కొనుక్కోగలరు కాని నిద్ర బాగుంటుందని చెప్పలేము. Bible లో యేసు అంటాడు: 'మీకు ఆత్మానందం కలిగిన వెంటనే, హృదయంలో ఉన్న స్వర్గరాజ్యం దొరికిన వెంటనే వెయ్యి జన్మలకు సరిపడా దుఃఖమంతా ఆనందంగా మారిపోతుంది. ఓడ అంత దుఃఖం ఆనందంగా మారిపోతుంది'.

**'ఈ ముష్టివాళ్ళకా ఆత్మజ్ఞానం?' అన్నాడు స్వామి రామతీర్థ**: ఇంట్లో దేవుని మందిరంలో ఒక దేవుడిని పెట్టుకోవడం. ఏవో ఏవో పిచ్చి కోరికలు కోరుకోవడం. ఉదాహరణకు మా అబ్బాయికి engineering seat రావాలి, మా అమ్మాయికి మంచి సంబంధం కుదిరి పెళ్లి అవ్వాలి, మా ఆరోగ్యం బాగుపడాలి, వ్యాపారం అభివృద్ధిలోకి వచ్చేయాలి, కారు కొనుక్కోవాలి, ఇల్లు కొనుక్కోవాలి etc., ఈ కోరికలు తీరిపోయాక మరో కోరికలు- ఇక వీటికి అంతే లేదు. ఇటువంటి పిచ్చి పిచ్చి ఆలోచనలతో ఉండే ఈ ముష్టివాళ్ళకా ఆత్మజ్ఞానం? అన్నాడు స్వామి రామతీర్థ. మనకు మరో పని లేదు. దేవుడి photo ఎదురుగా పెట్టుకుని ఈ కోరికలు అన్నీ చెప్పటం. గుడికి వెళ్ళినా ఇదే పని. ఇంట్లో ఉన్నా ఇదే పని. ఒక బిచ్చగాడు ధర్మం చేయమని అడిగితే మీరు రూపాయో, పది రూపాయలో ఇవ్వచ్చు కాని వాడి పట్ల మీకు గౌరవం ఏమి ఉండదు. ఒక బిచ్చగాడి పట్ల మీకే గౌరవం లేనప్పుడు మీపట్ల భగవంతునికి గౌరవం ఏమి ఉంటుంది? ఈ బాపతి జనం తగ్గటమే నయం అని మీ కోరిక నెరవేర్చి ఊరుకుంటాడు భగవంతుడు. 'ఈ ముష్టి వాళ్ళ కింద బతకకండి. ఇలా అడుక్కునే వాళ్ళను దేవుడు మోక్షం list లో పెట్టడు. గుడికి వెళ్లి మనకున్న పెంటను వదిలించుకోక ఇంకా పెంట నోల్లుకోవటం. గుడికి వెళ్లి నా బలహీనతలే, నా అలవాట్లే, నా సంస్కారలే నన్ను పాడు చేస్తున్నాయి. ఇల్లే కాదు వళ్ళును కూడా గుల్ల చేస్తున్నాయి. అందుచేత వీటిలోంచి నన్ను విడుదలచేసి సన్మార్గంలో నడిపించు అని అడిగేవాడు ఒక్కడు కూడా కనబడడు' అన్నాడు స్వామి రామతీర్థ. ఈయిన లెక్కల్లో genius. punjab university లో లెక్కల్లో ఈయనకు వచ్చిన మార్కులు ఇంతవరకూ ఎవరికీ రాలేదు. ఉత్తరాంచల్ రాజధాని dehradun లో స్వామి రామతీర్థ సమాధి ఇప్పటికీ ఉంది. ఎప్పుడూ ఏదో ఒకటి కోరుకొనే ఈ ముష్టివాళ్ళకా జ్ఞానం అంటాడు రామతీర్థ. ఎందుచేతంటే ఏ కోరిక మంచిదో ఏ కోరిక చెడ్డదో మనకు తెలియదు. తెలీక ఏదో ఒకటి కోరేసుకుంటాం.



ఒకోసారి మన కోరిక నెరవేరితేనే ప్రమాదం. అందుచేత 'Thy will be done' నీ సంకల్పమే నెరవేరుగాక అనుకుంటే అవసరాలు తీరిపోతాయి. చివరకు మోక్షం కూడా ఇస్తాడు. ఈశ్వర సంకల్పం నెరవేరాలి అనుకోకుండా ఏదో ఒకటి కోరేసుకుంటే మీ కోరికలే మీ కొంపలు ముంచుతాయి అని చెప్పాడు స్వామి రామతీర్థ. మనకు ఏది మంచిదో మనకంటే బాగా భగవంతునికి తెలుసు. కాబట్టి నీ సంకల్పమే నెరవేరుగాక అంటే సరిపోతుంది. మీరెవరో మీకు తెలియదు అనుకోండి, మీకు వెయ్యి కోట్లు ఉన్నా, అంగబలం, అర్థబలం ఉన్నా అవన్నీ స్వప్న సమానమే. మీరెవరో మీకు తెలియనంత కాలం ఏదో ఒకటి అడుగుతూ ముష్టివాళ్ళకిందే బతుకుతారు. ముష్టి వాళ్ళకు ఆత్మజ్ఞానం రాదు అన్నారు స్వామి రామతీర్థ.

**useless thoughts, useless talks, useless actions- వీటిని కలుపు మొక్కల్లా తీసి పక్కకు పెట్టు:** ఉపయోగం లేని ఆలోచనలు, మాటలు, చేతలు కలుపు మొక్కలు అన్నాడు రామతీర్థ. కలుపు మొక్కలు జాతి మొక్కైనా బ్రతక నివ్వవు. అందుచేత వాటిని తీసేస్తాము. అదే విధంగా ఉపయోగం లేని పనులు మానేయి లేకపోతే నీ స్వరూపాన్నే కప్పేస్తాయి. కొంత మంది చేసే పని వాళ్లకు గాని సమాజానికి గాని దేవుడికి గాని ఉపయోగపడవు. useless thoughts, useless talks, useless actions- వీటిని కలుపు మొక్కల్లా తీసి పక్కకు పెట్టు. ఆలోచించి మాట్లాడు, ఆలోచించి పని చేయి. ఎందుచేతనంటే ఆలోచించకుండా నోటికి వచ్చింది మాట్లాడి పశ్చాత్తాప పడటంకంటే ముందే ఆలోచించి మాట్లాడితే, పనిచేస్తే తిరిగి పశ్చాత్తాప పడి బాధపడనక్కర్లేదు. తర్వాత ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండండి. తినేది ఒక్కటే ఆహారం కాదు. చెవులతో వినేది, కళ్ళతో చూసేదంతా కూడా ఆహారమే. అంటే ఇంద్రియాలతో స్వీకరించేదంతా కూడా ఆహారమే. అందుచేత ఇంద్రియాల తో మంచే తీసుకోవాలి. తర్వాత ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిది. నీ శక్తి ఎక్కువ వృధా అవ్వదు.



**ఊరూరు తిరుగక ఉల్లము నిను గని అనగ నీ ధ్యుతి చూపుము అరుణాచలా**: అక్షరమణమాలలో భగవాన్ అన్నారు: ‘ఓ అరుణాచలా! ఈ జీవుడున్నాడే, వాడు ఎన్ని లోకాలు తిరిగాడో, ఎన్నిసార్లు చచ్చాడో, ఎన్ని శరీరాలు ధరించాడో - అది పురుష శరీరం అవ్వచ్చు, స్త్రీ శరీరం అవ్వచ్చు, దేవతా శరీరం అవ్వచ్చు- శరీరం ఏదైనా ఒకటే. జీవుడికి మరో పనిలేదు. ఒక ఇంట్లో ఈ గదినుంచి మరో గదిలోకి వెళ్ళినట్లు శరీరాలు మార్చటం అంటే ఒక శరీరం చచ్చిపోయినప్పుడు మరో శరీరం మార్చటం. ఇలా జన్మలు మారుస్తూ ఆ లోకం కాదని ఈ లోకం, ఈ లోకం కాదని మరోలోకం, ఇలా తిరుగుతూనే ఉన్నాడు. వీనికి ముగింపులేదు. జీవుడు ఇలా తిరుగుపోతు అయిపోయాడు. నేను ఎంత సాధన చేస్తే మాత్రం ఇలా తిరగటానికి అలవాటు పడిన జీవుడు తిరగటం మానుతాడా? నువ్వు ఏమి చేస్తావంటే నువ్వు హృదయంలో ఉండటం కాదు. నీ శక్తి చూపించు అరుణాచలా! నేను శక్తి లేని వాడినే. నీ ప్రకాశం అంతా, నీ energy అంతా, నీ వైభవం అంతా ఒక్కసారి ఈ జీవుడికి చూపించు. నువ్వు ఎంత శక్తిమంతుడవో చూపించు. అప్పుడు సుబ్బరంగా అణిగిపోయి పత్తాలేకుండా పోతాడు. ఇక మాకు రైళ్ళమీద కార్లమీద ఊరూరా తిరిగే గొడవ వదిలిపోతుంది. శవాలు మోయనక్కర్లేదు. నీలో కలిసిపోతాడు. లేకపోతే ఈ జీవుడు రక్షింపబడే విధానం లేదు. నీవు హృదయంలో ఉన్నావు కదా. తిరిగి పుట్టకుండా ఉండటం అనేది ఆత్మజ్ఞానం వల్ల మాత్రమే సాధ్యం. అందుచేత నీ జ్ఞానం యొక్క వైభవం చూపించావనుకో నీ శక్తికి వీడు లొంగిపోయి నీకు స్వాధీనం అవుతాడు. అప్పుడు కాని నాకు వీడి పీడవదలదు, ప్రయాణాలు ఆగవు.







**తల్లి తండ్రి గురువు- ఈ ముగ్గురిని ఎవరూ మరచిపోరాదు అని వేదంలో చెప్పబడింది**: తల్లిదండ్రులను ఎందుకు మరచిపోకూడదు అంటే వారు మీకు శరీరం ఇచ్చారు, అన్నం పెట్టారు, చదువు చెప్పించారు. వాళ్ళు మంచి వాళ్ళా లేక చెడ్డ వాళ్ళా అనేది మనకు అనవసరం. మీకు రెక్కలు ఇచ్చారు కాబట్టి ఇవాళ ఇలా ఉన్నారు. రెక్కలు లేనప్పుడు మిమ్మలను ఎవరు చూసారు? రెక్కలు ఇచ్చారు కాబట్టి అమెరికా, ఇంగ్లాండ్ ఎగిరిపోతున్నారు. ఇవాళ్ళ అందరూ పెత్తనదారులైపోయారు. మీకు శరీరాన్ని ఇచ్చి, అన్నం పెట్టి, బట్టలు ఇచ్చి, చదువు చెప్పించిన తల్లిదండ్రులను మరచిపోతే నీకు జ్ఞానం ఏమిటి? అన్నాడు వేదంలో. ఆత్మజ్ఞానం మాత్రం గురువొక్కడే ఇవ్వగలడు. అందుచేత గురువును మరచిపోవద్దు. గురువు లేని విద్య గుడ్డివిద్య. మీకు ఎన్నివేల కోట్ల డబ్బున్నా ఆత్మజ్ఞానం కలగకుండా అశాంతిలోంచి, దుఃఖం లోంచి, పునర్జన్మలోంచి ఎవరూకూడా బయటకు రాలేరు. ఆత్మజ్ఞానం గురువు యొక్క ప్రసాదం. గురువుకే చెల్లింది ఇవ్వటానికి. అందుచేత వీరి ముగ్గురిని జీవితంలో మరువరాదు అని వేదంలో చెప్పబడింది.

**జ్ఞానం వేడిగా ఉండదు**: 'అరుణాచలంలో వేడిగా ఉంటుందా?' అని ఒకరు భగవాన్ని అడిగితే భగవాన్ అన్నారు: 'అరుణాచలం వేడిగా ఉన్నా జ్ఞానం వేడిగా ఉండదు. జ్ఞానం వేడి చెయ్యదు'. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా wait చేయవలసిందే. భరించ వలసిందే. చావు అంటే ఏమీ లేదు. శరీరాలను మార్చటం అంతే.




**జ్ఞాని సందర్శనం ఊరికేపోదు**: అత్యం సూర్యంగారు తన భార్యతో భగవాన్ దగ్గరికి వచ్చారు. భగవాన్ ఆయనకు మాదిగోడిలా కనిపించారు. భార్య ఆశ్రమానికి 100 రూపాయలు ఇవ్వమంది. 'నేనివ్వను' అన్నారాయన. 'మీరివ్వకపోతే నేనిస్తాను. మీ మీద గౌరవంతో ఇవ్వమన్నాను' అంది ఆవిడ. అప్పుడు ఇస్తాడు ఆయన ఆ 100 రూపాయలు. నాన్నగారిని కలిసినప్పుడు అత్యంసూర్యం గారు అన్నారు: 'తర్వాత 20 సంవత్సరాలకు అమెరికాలో accident అవ్వబోతుంటే ఈ మాదిగోడే రక్షించాడు. 1945 లో చూశాను. అప్పుడు భక్తుడిని అవ్వలేదు. 1965 లో రమణ భక్తుడిని అయ్యాను. ఈయన మాదిగోడు అనుకున్నా భగవాన్ అనుగ్రహించటం మానలేదు. వచ్చి చూసింది ఊరికే పోలేదు'. వాడు మాదిగోడు అనుకుంటున్నాడని భగవాన్ ఆయన్ని వేరుగా చూడలేదు. అది తలంపే కదా. ఇటువంటి వాటికి వారు అతీతం. He is above above all these things.






**ప్రకృతిని దాటిన వారు అక్కడ జీవించారు కాబట్టి అవి పుణ్యక్షేత్రాలు అయినాయి**: 'భగవంతుడు అంతటా ఉన్నప్పుడు పుణ్యక్షేత్రాలకు అంత ప్రాముఖ్యత ఎందుకు?' అంటే నాన్నగారు అన్నారు: 'tube light వెలుతురు గదంతా వ్యాపిస్తుంది కాని tubelight దగ్గర కొంత ఎక్కువ వెలుగు ఉంటుంది. పుణ్యక్షేత్రాలు ఎలా వచ్చాయంటే ఆ ప్రాంతంలో కొందరు పరమపవిత్రులు జీవించారు. వారికి మనస్సు లేదు. ప్రాణం ఉన్నా లేనివారితో సమానం. కళ్ళున్నా, చెవులున్నా లేని వారివలె perfect గా జీవించారు. ఆ ప్రాంతంలో వారి vibrations ఉంటాయి. ప్రకృతిని దాటిన వారు అక్కడ జీవించారు కాబట్టి అవి పుణ్యక్షేత్రాలు అయినాయి.




**అన్ని నియమాలలో ఆహారనియమం ఉత్తమమైనది:** ఆహారనియమం వల్ల నీ ప్రయత్నం ఎక్కువ లేకుండానే మనోనిగ్రహం సాధ్యమౌతుంది. భోజనం చేసినా చేయని వారిలా ఉండాలి. అంటే ఆహారం అంత తేలిగ్గా తీసుకోవాలి. అప్పుడు mind ఆలోచించడానికి విచారణకు సహకరిస్తుంది. ఎప్పుడు శరీరానికి ఆరోగ్యం తప్పుతుందో అప్పుడు mind కి control తప్పుతుంది. ఆకలి లేదంటే జ్వరం అయినా వచ్చి ఉండాలి లేక ఆ గడ్డి, ఈ గడ్డి తిని ఉండాలి. కొందరు రెండు రోజుల ప్రయాణంలో కూడా ఏమి తినరు. ఇంటినుంచే తెచ్చుకుంటారు. మన బుద్ధి నిర్మలంగా ఉండటానికి, మనో నిగ్రహానికి, ఇంద్రియ నిగ్రహానికి, నియమబద్ధమైన జీవితం కోసం మన పెద్దలు ఆహార నియమం పెట్టారు. 5 స్టార్ hotels కి వెళ్లి ఒకపూట తింటే 10 రోజులు hospital లో ఉండాలి. stomach upset అయిపోతుంది. మామూలు జఠరాగ్ని తిరిగిరావడానికి 5 రోజులు పడుతుంది. సాంప్రదాయాలు, ఆహార నియమం పాటించడం వల్ల నీ బుద్ధి శుద్ధి అవుతుంది. అవి పెట్టిన మన పూర్వీకులు పిచ్చి వారేమి కాదు. మనము Mad after fame, Mad after money, Mad after power- పిచ్చి మనకా వాళ్ళకా?




**బంగారం లాంటి శరీరాలు, బంగారం లాంటి మనస్సులు అంటే యోగులవి, మహర్షులవి, భగవంతుని అవతారమూర్తులవి**: ఇక్కడ చాలా శరీరాలు ఉన్నాయి. భవిష్యత్తులో ఇలా చాలా శరీరాలు వస్తాయి పోతాయి. అసలు మన శరీరం కాని పేరు కాని ఇంతవరకు ఎవరికైనా ఉపయోగపడినాయా? బంగారం లాంటి శరీరాలు, బంగారం లాంటి మనస్సులు అంటే యోగులవి, మహర్షులవి, భగవంతుని అవతారమూర్తులవి. వారి శరీరం అంటే అవతారం. ఆ పేరు స్మరించి ముక్తిని పొందిన వాళ్ళున్నారు. మన రూపం నామం ఎవరికీ ఉపయోగపడవు. ఇంక మిగిలింది అహంకారం. అందుకే ఆచార్యుల వారు 'నా ముఖంలో ఎప్పుడూ అవినయం రానివ్వకు' అని ఈశ్వరుడిని ప్రార్థించారు. రామ రామ, కృష్ణా కృష్ణా అంటే శాంతి వచ్చేస్తుంది, బాగుపడుతున్నాం. మీ పేరు తలపెట్టుకొని ఈ సృష్టిలో ఇంతవరకు ఒక్కరైనా బాగుపడ్డారా? పోనీ ఈ లోకానికి మీ శరీరం ఏమైనా ఉపయోగపడిందా? ఇక ఏమి చూసుకొని మీకు అహంకారం? మన పేర్లు తలపెట్టుకుంటే అవతల వారికి లేని వికారాలు వస్తాయి. కొంత మంది చూస్తే తినే అన్నం కూడా తినద్దు అంటారు. వాడిదే అయినా వాడికి జీర్ణం అవ్వదని చాటుకి వెళ్లి తినమంటారు. మన పేరు ఎవరికీ పనికి రాదు, శరీరం ఎవరికీ ఉపయోగ పడదు. మిగిలింది అహంకారం. కనీసం భగవంతుని కళ్యాణ గుణాలు శ్రవణం చేసి సంతోషించే గుణం లేని మనకా వైరాగ్యం, విశ్వాసం, ఆత్మజ్ఞానం?



**తల్లిదండ్రులు చేయలేని సహాయం వాతావరణం (సహవాసం) చేస్తుంది**: మన దేహం ఎక్కడ ఉన్నా పొందవలసింది మన దృష్టిలో ఉండాలి. దానికి ఇంద్రియాలు, మనస్సు,శరీరం, వాతావరణం అన్నీ సహకరించాలి. వాతావరణం అంటే గాలి, నీరు, వెలుతురు అని కాదు అర్థం. వాతావరణం అమ్మకంటే గొప్పది అని అంటారు. ఎందుచేతనంటే మనచుట్టూ ఎప్పుడూ నాస్తికులే (దేవుడు, భక్తి, జ్ఞానం లేవు అని చెప్పేవారు) ఉంటే, వాళ్ళు ఎలాగో పాడైపోయారు, మననూ పాడు చేసేస్తారు. KVK Raju గారు అనేవారు: పదిమందిలో చూసుకోకుండా ఒక సోమరిపోతుకి ఉద్యోగం ఇచ్చమంటే మొత్తం అందరిని వాడు పాడు చేసేస్తాడు'. అందుచేత ఈ ఆధ్యాత్మిక జీవితానిక వివేకం, విశ్లేషణ ఉండాలి. మన ఆధ్యాత్మిక పురోగమానికి సహకరించే వారుంటే అదే వాతావరణం. మామూలు వాతావరణం ఎలా ఉన్నా మన చుట్టూ ఉండేవారి వాతావరణం ముఖ్యం. రామకృష్ణుడు అనేవాడు: 'నా భక్తిచెడగొట్టే వాళ్ళందర్ని నా దగ్గరికి పంపుతున్నావు ఏంటమ్మా? లౌకికులను కాదు భక్తులను పంపించు'. అందుచేత తల్లి సహాయం లేక పోయినా, మన చుట్టూ ఉండేవారు మంచివారు అయితే, అటువంటి వాతావరణ సహకారం ఉంటే ఎంతో అభివృద్ధిలోకి వెళ్లిపోతాము. మనం సాధన లో పడిపోతుంటే మంచి మాట చెప్పి support గా ఉండి encourage చేసేవారుంటే అది మంచి వాతావరణం అని అర్థం. అటువంటివారు మన చుట్టూ ఎవ్వరూ కనబడటం లేదనుకోండి వాతావరణం బాగోనట్లు గుర్తు. 24 గంటలు litigation పెట్టే వారితో మనకు స్నేహం ఏమిటి? తల్లిదండ్రులు చేయలేని సహాయం వాతావరణం (సహవాసం) చేస్తుంది.

**నా మనస్సులో ఏముందో భగవాన్ కు తెలియకుండా ఆపుచేయలేక పోతున్నాను అన్నారు చలంగారు**: చింతా దీక్షితులు గారు అని ఉండేవారు. చలం గారిని భగవాన్ కు పరిచయం చేసింది ఆయనే. చలంగారిని దీక్షితులుగారు అరుణాచలం తీసుకెళ్ళారు. చలంగారు అన్నారు: భగవాన్ ను చూశాను. నాకేమీ ఆకర్షణ కలుగలేదు. తరువాత రెండురోజులున్నాం. దీక్షితులగారు అన్నారు భగవాన్ తో వెళ్లివస్తాం అని చెప్పి వెళ్ళిపోదాం. ఇద్దరమూ భగవాన్ దగ్గరకి వెళ్ళాము. భగవాన్ అప్పుడే కొండ దిగివస్తున్నారు. దీక్షితులుగారు వెళ్లివస్తాం అని చెబుతున్నా భగవాన్ ఆయనవంక చూడలేదు.



కాని నా వంక చూసి చిరునవ్వు నవ్వారు. ఆ చిరునవ్వు నవ్వినప్పుడు నా మనస్సులో ఏముందో, ప్రతీ చిన్న విషయం ఆయనకు తెలిసిపోతుంది. ఈయన్ని గౌరవించటం ఏమిటిరా అనుకున్నాను కదా. అదీ తెలిసిపోతుంది. నా మనస్సులో ఏముందో అన్నీ తెలిసిపోతున్నాయి. నా మనస్సులో ఏముందో ఆయనకు తెలియకుండా నేను ఆపుచేయలేకపోతున్నాను'.

**కొండ ఎప్పుడూ ఉంటుంది కాని మీరు ఎప్పటికీ ఉండరు కదా**: చింతాదీక్షితులు గారు వెచ్చని నీరుకింద ఉన్నారు, చలం గారు పూర్తిగా వేడెక్కిపోయారు. 1949 నుంచి చనిపోయేవరకు చలంగారు అరుణాచలంలోనే ఉండిపోయారు. ఒకసారి దీక్షితులు గారికి చలంగారు ఉత్తరం వ్రాశారు. 'మీరు అరుణాచలాన్ని వదులుకున్నారు. మీరు ఒకసారి అరుణాచలం రండి' అని వ్రాశారు. దానికి దీక్షితులుగారు జవాబు వ్రాస్తూ అన్నారు: ' ఇప్పుడు భగవాన్ లేరు కదా. వచ్చి ఆ కొండను చూడాలి. ఆ కొండ ఎప్పుడూ ఉంటుంది కదా. కృతయుగం నాటి నుంచి ఆ కొండ ఉంది. ఎప్పుడు వచ్చినా పర్వాలేదు కదా' అంటే చలంగారు ఒక వాక్యం వ్రాశారు. అది అపూర్వం, అద్భుతం, ఉదాత్తం: 'దీక్షితులు గారు మీరు వ్రాసింది కరెక్ట్. ఆ కొండ ఎప్పుడూ ఉంటుంది కాని మీరు ఎప్పుడూ ఉండరు కదా. మీరు ఉండాలికదా ఆ కొండ చూడటానికి. ఆ వైపు మీరు ఆలోచించటం లేదు'.

**కోరిక దుఃఖ హేతువు అయితే ఆశ బంధహేతు**: 'బుద్ధుడు కోరిక దుఃఖ హేతువు అన్నాడు. ఆచార్యుల వారు ఆశ బంధహేతువు అన్నారు. ఆశ, కోరిక రెండూ ఒకటేనా లేక తేడా ఏమైనా ఉందా?' అని ఒకరు ప్రశ్నిస్తే నాన్నగారు అన్నారు: 'కొంతమందికి తెలివితేటలు ఎక్కువగా ఉంటాయి కాని హృదయ వైశాల్యం తక్కువగా ఉంటుంది. తెలివితేటలకి శంకరులు, హృదయ వైశల్యానికి బుద్ధుడు పరాకాష్ట (గొప్పవారు). ఆశకి కోరికకి సూక్ష్మంగా తేడా ఉంది. వివేకచూడామణి లో ఆచార్యులవారు అన్నారు: 'ఆశ కోరిక స్థూలంగా ఒకటిగా కనిపిస్తాయి కాని కాదు'. మన అవసరాలకు మించి కాకుండా, దేహం యొక్క అవసరాలకు కుటుంబ అవసరాలకు సరిపడ పని చేసుకుంటే అది ఆశకాదు, అది కోరిక. కోరిక ముదిరితే అది ఆశ అవుతుంది. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఆదాయం సరిపోతే నీకు ఆశ పుట్టదు. అవసరానికి మించిన ధనం వచ్చేకొలది అది ఆశగా మారుతుంది. అవసరాలకు మించి ఉంటే అది ఆశ. ఆశ అనేది పెద్ద గొయ్యి. దాన్ని ఎవ్వరూ పూడ్చ లేరు. కృష్ణుడిని ఒకరు అడిగారు: మీ భక్తులకు తక్కువ డబ్బు ఇస్తున్నారు. మీ భక్తులు కాని వారికి ఎక్కువ డబ్బులు ఇస్తున్నారేంటి?' అంటే కృష్ణుడు అన్నాడు: 'ఎక్కువ డబ్బు ఇచ్చేస్తే ఆశ పెరిగిపోతుంది. నా భక్తుడిని కాపాడుకోవాలి కదా'. డబ్బు ఎక్కువ వస్తే భోగాలు & అలవాట్లు పెరుగుతాయి, సోమరితనం వచ్చేస్తుంది, పాడైపోతారు. పది తరాలకు సరిపడ సంపదించేయాలి అనుకోవడం ఆశ. పుట్టుకతోనే కొందరు ఆశాపరులుగా జన్మిస్తారు. ఆశ స్థూలమైనది, కోరిక సూక్ష్మమైనది. కొందరు జీవితంలో కష్టపడి అభివృద్ధిలోకి రావాలని అనుకుంటారు. అది ఆశ కాదు కోరిక. అయినా వాడి మనస్సు బాహ్యాముఖంగా ఉంటుంది. అంతర్ముఖం అవ్వదు. బాహ్యాముఖం అయిన మనస్సు దుఃఖపడుతుంది అన్నాడు బుద్ధుడు. ఏ రకమైన కోరిక వచ్చినా నీవు నీ స్వరూపం లోంచి బయటకు వచ్చేస్తావు. మనస్సు ఏ రకమైన కారణం వలన బయటకు వెళ్ళినా దుఃఖం వచ్చి తీరుతుంది. మంచి కోరిక బంగారపు సంకెళ్ళు అయితే చెడ్డ కోరిక ఇనుప సంకెళ్ళతో సమానం. ఎక్కడ సుఖం లేదో ఎక్కడ ఆనందం లేదో అక్కడ మనస్సు వెదుకుతుంది కాబట్టి దుఃఖ హేతువు. ఒక మనిషి ద్వారాగాని, అధికారం ద్వారాగాని ఏ రకమైన సంఘటనలు ద్వారాగాని, సంపదలనుబట్టి గాని ఏ కారణం వలనైనా pleasure తీసుకుంటే పరిణామం లో అది దుఃఖంగా మారిపోతుంది. ఫలానా పేరు నాది, ఫలానా ఊరు నాది, ఫలానా దేహం నాది అని మీరు కానిదానితో తాదాప్యం చెందితే, మీకు దుఃఖకారణం పెరిగి పోతుంది. నీకు దేహాత్మబుద్ధి ఉన్నంత కాలం, నీ


అస్థిత్వాన్ని దేహానికి పరిమితం చేసుకున్నంత కాలం కోరిక రాకుండా ఆపలేవు. మనకు భిన్నంగా ఏ వస్తువు కనిపించినా, అక్కడ నుంచి కోరిక arise అవుతుంది. నీ స్వరూపాన్ని విడిచి పెట్టి బయటకి వస్తే కోరిక వస్తుంది. స్వరూపం అరూపం. స్వరూపాన్ని విడిచి పెట్టని వాడికి కోరిక రాదు. అరవింద ఘోష్ అన్నారు: 'అసలు కోరిక రాకుండా కాపాడు కోలేవు.  నీకు సినిమా చూడాలనే కోరిక mind లో వస్తుంది. అప్పుడు నీ శరీరాన్ని తీసుకెళ్ళి cinema hall లో పడేయకు. దానిని ఆపు చేస్తే ఎక్కువ సంతృప్తి వస్తుంది'. కృష్ణుడు practical man. ground realities బాగా తెలుసు. కృష్ణుడు అన్నాడు: 'మీకు ఏ సంపాదన లేకుండా ఇంట్లోవాళ్ల మీద ఆధారపడ్డా వారు మిమ్మల్ని బానిసలుగా చూస్తారు. నీ పొట్టకి సరిపడా సంపాదించుకుంటే అది కోరిక కాదు, ఆశ కాదు. అవసరానికి మించిన డబ్బు ఉంచుకుంటే కోరిక ఆశలోకి వచ్చేస్తుంది. అవసరానికి మించిన డబ్బు ఉంటే దానిని సమాజ దేవుడికి ఉపయోగించు. ఈ నామరూపాలన్నీ నాయందే కల్పించబడ్డాయి. దానిని సమాజ రూపంలో ఉపయోగించడం వలన నీకు నీవే లాభ పడుతున్నావు. నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. పేరు కోసం పని చేసినా దానాలు చేసినా, డబ్బు ఖర్చుపెట్టి అజ్ఞానం కొనుక్కోవడం అవుతుంది'. నీ రూపబుద్ధి నామబుద్ధి మరచిపోయి selfless work చేస్తే, నీకు చిత్తశుద్ధి మరియు మంచిబుద్ధి కలుగుతాయి. సత్కర్మ నిష్కామంగా చేస్తే చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి కలిగిన వాడికే మంచివిషయాలను గ్రహణం చేయాలనే బుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి లేనివాడిని ఇక్కడ కూర్చోబెట్టి శ్రవణం చేయిస్తే పారిపోతాడు. ఎవరి సొత్తు మంచి విషయాలు వినటం? డబ్బే సత్కర్మ కాదు, మాట సహాయం కూడా సత్కర్మే. ఆశ అనేది రోగం కాని రోగకారణం కాదు. రోగకారణం మమకారం. విధురుడు ధృతరాష్ట్రుడిని అడిగాడు: 'పాండవులను పాచికలు ఆడటానికి నీ పుత్రులు ఆహ్వానిస్తుంటే, అది తప్పని తెలిసినా ఎందుకు వారించటంలేదు?' అంటే ధృతరాష్ట్రుడు అన్నాడు: ' అది తప్పని నాకు తెలుసు. కాని వారించలేక పోతున్నాను. మమకారం తప్పుని కూడా వారించనివ్వదు'. అందుకే 'attachment is a sin' అన్నారు. ఆశ అనేది నరక హేతువు. కోరిక అయినా ఆశ అయినా మమకారం లోనుంచి వస్తుంది. పుస్తకాలలో జపం ధ్యానం చేయమంటున్నారు. నీకు మమకారం లేకపోతే జపం-ధ్యానం దేనికి? త్యాగరాజు అన్నాడు: 'తనువు తాను కాదని తెలిసిన వాడికి జపమేల, తపమేల, ధ్యానమేల, మంత్రములేల, తంత్రములేల?'


**విధి చాలా బలీయమైనది. అందుకే లోకాన్ని సినిమాగా చూసి నీ ఇంటికి నువ్వు వెళ్ళిపో:** భీష్ముడు అంతటి మహాజ్ఞాని కౌరవపక్షంలో ఉండటం ఏమిటి? అంటే చాలామంది అది ప్రారబ్ధం, కర్తవ్యం అని అనేకరకాలుగా చెబుతారు. కాని భగవాన్ భీష్ముని గూర్చి మాట్లాడుతూ: 'A good man in a bad company' అన్నారు. That is destiny. అది ఎవ్వరూ తప్పించలేరు. అపరితమైన అనురాగాముగ్న అన్నదమ్ములను కూడా ప్రారబ్ధం విడదీస్తుంది. దానికి ఉదాహరణ వాలి సుగ్రీవులు. కోపం, ఉద్రేకం ఆలోచనను చంపేస్తాయి. వాలి సుగ్రీవులు రాక్షసుడిని చంపడానికి వెళ్ళినప్పుడు ఒకరు బయట కాపలా ఉండి ఇంకొకరు లోపల గుహలోకి రాక్షసుడిని చంపటానికి వెళ్ళాలి అని నిర్ణయించుకుంటారు. అలా సుగ్రీవుడు బయట కాపలా ఉండగా వాలి రాక్షసుడిని చంపటానికి గుహ లోపలికి ప్రవేశిస్తాడు. వాలి రాక్షసుడిని చంపేస్తాడు. ఆ రక్తం గుహలోంచి బయటకు వస్తూంటే వాలి చనిపోయాడని భ్రమపడి, రాక్షసుడు తనను కూడా చంపెస్తాడేమో అని భయ పడి గుహద్వారానికి పెద్ద బండరాయి అడ్డుపెట్టి రాజ్యాన్ని పరిపాలించే బాధ్యత స్వీకరిస్తాడు సుగ్రీవుడు. రాజ్యకాంక్ష తో బండరాయి అడ్డుపెట్టాడని అపార్థం చేసుకుంటాడు వాలి. ఇదంతా ప్రారబ్ధంతో తాదప్యం చేందడం వలన వచ్చిన గొడవలు. ప్రారబ్ధం ఎంతటి వారినైనా విడదీస్తుంది. ఒకసారి గాంధీగారు మీటింగ్ కై తిరువన్నామలై వచ్చి రమణాశ్రమం గేటు ముందునుంచే వెళ్లిపోయారు కాని ఆశ్రమం లోకి రాలేదు. 'అదేంటి ఆశ్రమం గేటు ముందునుంచే ఒకసారి లోపలికి వచ్చి వెళ్ళవచ్చుకదా?' అని భగవాన్ తో అంటే 'ప్రక్కన ఉన్నవారు రానిచ్చి ఉండరు' అన్నారు భగవాన్. నాన్నగారు ఈ విషయం చెప్తూ అన్నారు: ఒక తమిళ్ ఆయన నాతో ఈ విషయం చెపితే నేను అన్నాను: భగవాన్ స్వభావం బట్టి చెబుతున్నాను భగవాన్ అలా అని ఉండరు. ఆ తమిళ్ ఆయన నాకు పాఠం చెప్పాడు. ఆయన అన్నాడు: భగవాన్ నోటెంట ఆ మాట వచ్చే ప్రారబ్ధం ఉన్నప్పుడు వచ్చేస్తుంది. దానికి జ్ఞానానికి సంబంధం ఏముంది? అంటే ప్రారబ్ధం అంత బలీయమైనది. ఎవరో బోయవాడు కొట్టిన దెబ్బకు కృష్ణుడి శరీరం చనిపోవటం ఏమిటి? ప్రారబ్ధం లో అలా జరుగవలసి ఉండి జరిగింది. అందుకే భగవాన్ అన్నారు: లోకాన్ని సినిమాగా చూసి నీ ఇంటికి నువ్వు వెళ్ళిపో. ఆ బొమ్మలను చూసే ఈ జీవుడు కూడా అందులో ఒక బొమ్మే. ఇది అర్థం అయితే మనస్సు హృదయంలో పడి ఉంటుంది.

**శాస్త్రం అంటే శాసనం. ధర్మమార్గంలో నడిపించేది శాస్త్రం:** science వేరు శాస్త్రం వేరు. science అనేది మనస్సు తో ఇంద్రియాలతో గ్రహించేది. శాస్త్రం మనస్సు అణిగినప్పుడు తోచేది. మన మనస్సు ఎంత నిజమో ఆ science అంతే నిజము. బుద్ధితోటి, ఇంద్రియాల తోటి గ్రహించేది 100% సత్యం అని చెప్పలేము. ఏదైతే సత్యమో అది నిత్యంగా ఉంటుంది. ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. అది బ్రహ్మం. అది తప్పించి మిగితావన్నీ పచ్చి అబద్ధాలు. శరీరం, మనస్సు, అహంకారం- ఇవన్నీ పచ్చి అబద్ధాలు. బ్రహ్మాన్ని దర్శించి చెప్పిన వారినే ఋషులంటారు. వారు చెప్పినవి ఆదేశాలు. అవి ఒక కాలానికి పరిమితమైనవి కావు. ఎవరో ఏదో చెప్పారని దాన్ని ప్రమాణంగా తీసుకోవద్దు. ఇది విధి, ఇది నిషేధం అని మహర్షులు చెప్పిన వాక్యాన్ని, శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకోవాలి. అవన్నీ ఆదేశాలు. ఈ మార్గంలో నడిస్తే మీకు శ్రేయస్సు కలుగుతుంది. ఈ మార్గంలో నడిస్తే అశాంతికి దూరం అవుతారు. అది శ్రేయోమార్గం. ఏదైతే మోక్ష సుఖాన్ని కలుగజేస్తుందో అటువంటి ధర్మమార్గంలో నడవండి అని చెప్పేది శాస్త్రం. అలా ధర్మ మార్గంలో నడిస్తే మోక్షం తాలుకూ ఆనందం వచ్చి తీరుతుంది. భగవంతుడు ఆదేశించిన పని చేస్తే, నిషేధించినది చేయకుండా ఉంటే మనోదేహాలకు సంబంధం లేని సుఖాన్ని మీ బుద్ధితో ఆస్వాదిస్తారని శాస్త్రం చెబుతుంది. మన హృదయంలో ఉన్న వస్తువు మనందరికీ భర్తగా, యజమానిగా ఉంది. అయితే మనం ఉన్నాం, ఆయన లేరు అనుకుంటున్నాం. దానికి కారణం ధర్మాన్ని ఆచరించక పోవడం, impersonal behaviour లేక పోవడం, శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకోక పోవడం.

**సాధన కొద్దిగా చేసినా మార్కులు పడతాయి:** పూర్వం చిన్న చిన్న దొంగతనాలు చేసేవాడు ఒకసారి సాధు వేషం వేసాడు. అందరూ అతడిని గౌరవించి పళ్ళు పూలు సమర్పించి నమస్కరిస్తుంటే, అతనికి అనిపించిందట: 'నేను దొంగ సాధువును కాని నన్ను నిజమైన సాధువు అనుకుంటున్నారు ఈ జనం. నిజంగా సాధువునైతే ఇంకెంతమంది పూజిస్తారో కదా' అని దొంగతనాలు మానేశాడట. సాదువుల్లో కలిసిపోయాడు. ఊరికే సాధు వేషం వల్ల మారు మనస్సు పొందాడు. జన్మాంతర సుకృతం ఏదో వాడికి కలిసి వచ్చింది. అందుకే మీరు చేసింది ఏది ఊరికే పోదు అన్నాడు పరమాత్మ. మీరు చేసుకున్న మంచి మీకే తిరిగి వచ్చేస్తుంది.

**జన్మాంతరంలో అనుబంధం ఉంటే ఆ స్నేహం కడవరకు కోనసాగుతుంది:** 1957 లో మొదటిసారి భగవాన్ గురించి తెలుసుకున్నాము. నా చిన్నప్పుడు మా నానమ్మగారితో కలిసి హ్రిషికేశ్, కాశి వెళ్ళాం. భగవాన్ జయంతి కొన్నాళ్ళకు వస్తుందనగా భగవాన్ నా కలలోకి వచ్చి నన్ను ఆశీర్వదించారు. తర్వాత లైబ్రరీ కి వెళ్ళినప్పుడు ప్రకటన చూసి భగవాన్ biography తెప్పించుకున్నాను. ఆ పుస్తకంలో భగవాన్ photo చూసినప్పుడు కలలో వచ్చిన ఆయన ఈయనే అని గుర్తించాను. ఇప్పుడు మాకు ఆశ్రమాలు వచ్చినవి. అవి మేము plan చేసుకొని కట్టినవి కాదు. వాటంతట అవే వచ్చినవి. అలాగే భగవాన్ని మేము తెచ్చుకోలేదు. ఆయనే వచ్చి మమ్మల్ని వరించారు. అందుకే 1957 లో భగవాన్ పట్ల ఎలా ఉన్నానో ఇప్పుడూ అలాగే ఉన్నాను. పల్టీలు కొట్టలేదు. నేను ఆయన్ను ఎత్తుకుంటే ఎప్పుడో దింపేద్దును. ఆయనే నన్ను ఎత్తుకున్నారు కాబట్టి దిగలేకపోతున్నాను. అది జన్మాంతర అనుభంధం. కాళిదాసు అన్నాడు: 'జన్మాంతరంలో అనుభంధం ఉంటే ఆ స్నేహం కడవరకు కోనసాగుతుంది లేకపోతే ఏదో ఒకచోట break అయిపోతుంది'. చాలామంది: 'మీ రమణమహర్షికి ఇంత పొట్ట ఉంది. ఏముంది ఆయనలో అంత విశేషం?' అని అన్నా నాకు ఎప్పుడూ వికారం రాలేదు. 'స్వామి వివేకానంద లాంటివారు ఈ లోకంలోకి వచ్చి ఎన్నో మంచి పనులు చేశారు. మీ రమణ స్వామికి తిని కూర్చోడం తప్ప వేరే పనేముంది?' అని వాళ్ళ ఉద్దేశ్యం. 'అసలు ఎక్కువ work జరుగుతుందే రమణస్వామి వల్ల' అంటే ఎంతమందికి అర్థం అవుతుంది? 'ఆయన జ్ఞాని కాకపోయినా మాకు అనవసరం. ఆయన teaching నచ్చింది' అని వారికి చెప్పాము. అదే చలంగారు కూడా అనేవారు: 'భగవాన్ ఎవరో, ఎందుకో, ఏమిటో నాకు అనవసరం. ఆయన నాకు ఆనందసముద్రుడు. ఆయన నుంచి వచ్చే శాంతి కాంతి నాకు కావాలి'. అది జన్మాంతర అనుబంధం. భగవాన్ అన్నారు: 'గత జన్మల్లో నాతో అనుబంధం లేనివాడు ఎవడూ ఈ gate లోకి రాలేడు. ఒక్కసారి ఈ gate లోకి వచ్చిన వాళ్ళు తరించితీరుతారు. ఎన్ని జన్మలు ఎత్తినా ఏదో జన్మలో నా ద్వారానే తరిస్తారు కాని మరో దారిలేదు. ఒకవేళ కోపం వచ్చి వెళ్ళిపోయినా మళ్ళీ తిరిగి వస్తారు. కారణం కోపం ఒక వికారం. అది నిజంకాదు'. పూర్వజన్మ అనుబంధానికి గుర్తు మాధవస్వామి (తెల్లనెమలి), గోలక్ష్మి (ఆకు కూరల అవ్వ). భగవాన్




కంటే ముందు ఆకు కూరల అవ్వే వచ్చింది. కొండమీద ఉన్న ఆకుకూరలన్నీ తెచ్చుకుని కూర ఒండుకునేది. అందుకు ఆవిడకు ఆ పేరు వచ్చింది. తర్వాత భగవాన్ వచ్చాక ఆయనకూ వండిపెట్టేది. ఆవిడకు పిల్లలు లేరు. భగవాన్ని సొంత బిడ్డలా చూసుకుంది. తర్వాత గోవుగా జన్మించి ఆశ్రమానికి వచ్చింది. 'గోలక్ష్మి వచ్చాకే ఆశ్రమానికి లక్ష్మి (ధనం) వచ్చింది' అన్నారు భగవాన్. ప్రతీ రోజు గోలక్ష్మి భగవాన్ను దర్శించుకొని కాని వెళ్ళి తన పనులు చూసుకునేది కాదు. అట్టిది వారి జన్మాంతర అనుబంధం.

**శవాన్ని ముద్దు పెట్టుకుంటే ఆ శవం అంటే భయం పోతుంది**: ఒకాయన 'శవాన్ని చూస్తే రోజంతా భయం వేస్తుంది' అంటే నాన్నగారు అన్నారు: 'ఆ శవాన్ని కూడా ముద్దుపెట్టుకునేంత ప్రేమ మీకు రావాలి. శరీరమే శవం. అంతే ఏమిలేదు. నాలుగు సార్లు ముద్దు పెట్టుకుంటే ఆ భయం పోతుంది. శవాన్ని కూడా మనం గౌరవంగా చూడాలి. దాన్ని స్నానం చేయించి, పూలు పెట్టి, బొట్టు పెట్టి, పుల్లల మీద గౌరవంగా పెట్టాలి. దాన్ని శవసంస్కారం అంటారు. దాన్ని గౌరవంగా చూడటం మానేసి భయం ఏంటి? చాలా చాలా మంచి వాళ్ళు అనుకో, వారు కాలుతూంటే, ఆ నిప్పుని కూడా మనకు ముద్దు పెట్టుకోవాలనిపిస్తుంది'.

**God is not far away. He is close and nearest to me**: ఒక భక్తుడు భగవంతుని ఇల్లు తెలుసుకోవాలి అనుకున్నాడు. కష్టపడి తెలుసుకొని దేవుని ఇంటికి వెళ్ళాడు. తలుపులు మూసి ఉన్నాయి. అయినా ఇంటి తలుపులు తట్టాడు. లోపలనుంచి ఎవరు వారు? అని ప్రశ్న వచ్చింది. (లోపల దేవుడు ఉన్నాడు, బయట జీవుడు ఉన్నాడు). వీడు నాది ఫలానా పేరు అని చెప్పాడు. అయినా తలుపు తెరువబడలేదు. తన రంగు, రూపం, లక్షణాలు చెబుతున్నాడు. తలుపు తెరుచుకోవటం లేదు. వాడు భక్తుడే కాని దేహబుద్ధి పోలేదు. దేహమే నేను అనుకుంటున్నాడు. మనం కూడా అంతే. ముసలివాళ్ళం అయిపోయాం అను కుంటాం. దేహం ముసలిది అవుతుంది కాని 'నేను' ముసలిది అవ్వదు. నేను అంటే మిథ్యా నేను కాదు. అది స్వచ్ఛమైన నేను. మనం నేను అంటాం; అది స్వచ్ఛమైనదే కాని ఆ నేను వచ్చి శరీరంతో, మనస్సుతో, ఇంద్రియాలతో కలవటం వల్ల కలుషితం అయ్యి మిథ్యా నేను అవుతుంది. నేనున్నాను – I AM THAT I AM- అది ముసలిది అవ్వదు. అది మనమై ఉండి ముసలివాళ్ళం అయిపోయాం అనుకుంటాం. కారణం దేహమే నేను అనుకోవటం వలన దేహం యొక్క ధర్మాన్ని మనమీద ఆపాదించుకుని ముసలివాడిని అయిపోయాను అనుకుంటాం. ఎంతకాలానికి తలుపు తెరుచుకోవటం లేదు అని వెనుతిరిగి కొంతకాలం తత్త్వబోధను శ్రవణం చేసి, సాధన చేసి బుద్ధి పక్వానికి వచ్చాక అప్పుడు వచ్చి తలుపు తట్టాడు. ఎవరు వారు? అని ప్రశ్న వచ్చింది. నువ్వే అన్నాడు. ఇక్కడ ఉన్నది నువ్వే అన్నాడు. అంటే అహంకారగతమైన నేను పోయింది. ఉన్నది నువ్వే అన్నాడు. తలుపు తెరువబడింది. చైతన్యంలో ఇక్యం అయ్యాడు. God is far away అనుకుంటాం. భగవంతుడి లోనే ఉండి భగవంతుడు ఎక్కడో దూరాన ఉన్నాడు అని వెతుక్కుంటున్నాము. కాని God is not far away. He is close and nearest to me.

**మనస్సు హృదయాన్ని విడిచి బయటకు వచ్చినంత కాలం సాధన చేయవలసిందే**: మనస్సు హృదయంలో లయం అయ్యాక వచ్చేది మౌనం. మనస్సు బాహ్యముఖం కాకూడదు. బాహ్యముఖం అవుతున్నంత కాలం సాధన చేయాలి. భగవాన్ ఆశ్రమంలో ఒక ఉడత మూడు పిల్లల్ని పెట్టి ఆహారనికై బయటకు వెళ్ళింది. కాని ఆ తల్లిని ఒక పిల్లి తినేసింది. 'వీటిని పెంచే బాధ్యత నా మీద పడింది' అన్నారు భగవాన్. వాటికి వేరుశనగపప్పు, జీడిపప్పు తెప్పించి వేసేవారు. అవి ఒకోసారి బయటకు వచ్చేస్తుంటే మళ్ళీ వీటిని కూడా పిల్లి తినేస్తుందేమో అని పట్టుకొని లోపల వేసేవారు. ఎవరో అడిగారు: 'ఏంటి స్వామి వాటిని పట్టుకొని లోపల వేస్తున్నారు?' అప్పుడు 'సాధన అంటే ఇదే' అన్నారు భగవాన్. 'మనస్సు హృదయాన్ని విడిచి బయటకు వచ్చేస్తుంది. దాన్ని మళ్ళీ తీసుకెళ్ళి అక్కడ పెట్టాలి. ఈ మాత్రం చేస్తే చాలు. నేను హృదయంలో ఉంచుతున్నాను. మీరు బయటకు వచ్చేస్తున్నారు. తిరిగి హృదయంలో ఉంచుతున్నాను. నేను చేసే సాధన ఇదే' అన్నారు భగవాన్. 'ఉడత బయటకు రావటం మానేసేవరకూ ఇలా పెడుతూ ఉంటాను' అన్నారు. ఎందుచేత? బయటకు వస్తే పిల్లి తినేస్తుంది. అలాగే మీరుకూడా బయటకు వస్తే,



మీరు ఎప్పుడు బయటకు వస్తారా అని మాయ కనిపెట్టుకుని ఉంది, మింగేయటానికి. మనస్సు హృదయం విడిచి బయటకు వస్తున్నంత కాలం సాధన చేయవలసిందే. మనస్సు బయటకు వెళ్ళడం ఆగిపోయిందనుకోండి, ఇక wandering ఉండదు. అప్పుడు సాధన అక్కర్లేదు. హృదయంలో మనస్సు స్థిరపడుతున్నప్పుడు ప్రయత్నంతో పనిలేదు. ఆ ప్రయత్నరహిత స్థితి వచ్చినప్పుడు ఆనందసాగరంలో ఊగిసలాడుతారు. హృదయంలో ఉన్న ఆనందం వచ్చి మీ సహస్రారాన్ని ముంచేస్తుంటే మనస్సు బయటకు వెళ్ళమన్నా వెళ్ళదు. సుఖం, ఆనందం, బయట ఎక్కడో ఉన్నాయి అనిపిస్తున్నంత కాలం సాధన విడిచిపెట్టకూడదు.



**ఈశ్వరుని సంకల్పం ప్రకారమే ఈ సృష్టి అంతా నడుస్తుంది - ఈ వాక్యం ఒక్కటే ఒక ఉపనిషత్తు:** ఆ మధ్య చెన్నై వెళ్ళినప్పుడు నర్సాపురం కాలేజిలో పని చేసే అబ్బాయి నా దగ్గరకు వచ్చాడు. నర్సాపురం లో 2500 Rs. ఉద్యోగం చేసేవాడు. తండ్రిపోయాక ఆ college లో ఈ అబ్బాయికి ఉద్యోగం ఇచ్చారు. అప్పుడప్పుడు జిన్నూరు కూడా వచ్చేవాడు. 'నువ్వు పెళ్లి చేసుకోవచ్చుగా' అనేవాడిని. 'అమ్మను చూసుకోవాలి. పెళ్ళాం వస్తే తనకూ తిండి పెట్టాలి కదా. ఇప్పుడు అమ్మను చూసుకోగలుగుతున్నాను. నాకు పెళ్లి ఎందుకు?' అన్నాడు. ఆ అబ్బాయి Bsc చేసి ఎలా నెర్చుకున్నాడో గాని computers బాగా నేర్చుకొని చెన్నై లో 60 వేల రూపాయల ఉద్యోగం సంపాదించాడు. ఎలాగో చెన్నైలో నా address తెలుసుకొని నా దగ్గరకు వచ్చాడు. 'నాకు 60 వేల రూపాయల ఉద్యోగం వచ్చింది. income tax కూడా కట్టేస్తున్నాను. పెళ్లి అయిపోయింది. మా ఆవిడ Mtech చదివింది. ఆవిడా ఉద్యోగం చూసుకుంటోంది. వచ్చే నెలలో ఆవిడకు ఉద్యోగం వచ్చేస్తుంది' అని చెప్పి ఒక 15 వేల రూపాయలు నా పాదాల దగ్గర పెట్టి మంచి కార్యక్రమాలకు ఉపయోగించమన్నాడు. నాకు నర్సాపురంలో అతని జీవితం గుర్తు వచ్చి తీసుకో బుద్ధి కాలేదు. అందుచేత 'ఇది నాదే నీ జేబులో పెట్టుకుంటాను' అని తిరిగి అతని జేబులో పెట్టేసాను. ఆ అబ్బాయి గమనించేసాడు. 'మీరు ఎంతసేపూ నా నర్సాపురం జీవితం గుర్తు పెట్టుకుంటున్నారు. మీ దయ వల్ల నాకిప్పుడు ఏ లోటూ లేదు. అందుచేత ఈ సొమ్ము మీరు తీసుకోవాలి లేకపోతే జిన్నూరు కాలువలో పడేయండి. ఒక వేళ నా ఎదుటే బయట పడేసినా నేనేమి చింతించను' అని తిరిగి ఇచ్చేసాడు.

అప్పుడు నేను ఏం చేసానంటే తీసుకుని పాలకొల్లు లో కడుతున్న సరస్వతి శిశుమందిర్ కు donate చేశాను. దానికి ఎవరు donate చేసినా income tax మినహాయింపు ఉంటుంది. వాళ్లకు డబ్బు ఇచ్చి వాళ్ళ దగ్గర income tax మినహాయింపు కాగితాలు తీసుకొని చెన్నైలో ఉన్న ఆ అబ్బాయికి courier లో పంపేసాను. ఆ డబ్బు తీసుకోటానికి తడిగుడ్డను పిండితే నీళ్ళు ఎలా వస్తాయో అంత బాధపడ్డాను. ఎందుకంటే అమ్మను ఎలా పోషించాలి అని బాధపడేవాడు. చాలా కష్టపడి ఆ జీతం కోసం నర్సాపురంలో పని చేసేవాడు. అదే నా మెదడులో ఉండి పోయింది. తిరిగి ఎప్పుడు తీసుకున్నాను అంటే 'జిన్నూరు కాలువలో పడేయండి' అన్నప్పుడు తీసుకున్నాను. ఇదంతా ఆ అబ్బాయి సహృదయానికి సద్బుద్ధికి గుర్తుగా చెప్తున్నాను. తర్వాత చెన్నై station కి తల్లిని భార్యను తీసుకొచ్చి చూపించాడు. అతని భార్యకు కూడా మొదలే 40 వేల రూపాయలు ఉద్యోగం వస్తుంది. మొత్తానికి లక్షాధికారి అయ్యే యోగం ఉంది లక్షాధికారులు అయిపోయారు. ఇదంతా ఆ అబ్బాయి తెలివితేటలు కాదు. ఈశ్వర సంకల్పం. ఆయన ఎక్కడ నిలబెడితే అక్కడ ఉండటానికే సరిపోతాం. ఆయన నిర్ణయంలో ఒక fullstop కాని comma కాని తేడా ఉండదు. అందుచేత ఆయన ఇష్టాన్ని మన ఇష్టంగా చేసుకుంటే మన దుఃఖం అంతా సుఖంగా మారిపోతుంది. 'ఈశ్వరుని సంకల్పం ప్రకారమే ఈ సృష్టి అంతా నడుస్తుంది' అని తెలుసుకోవాలి. ఏ మార్గంలో ప్రయాణించినా ఇది అర్థం కావాలి. ఇది అర్థం అయితే సుఖపడతావు లేకపోతే నీకు మిగిలేది దుఃఖం. ఈ వాక్యం ఒక్కటే ఒక ఉపనిషత్తు.

**మీకంటే మీ భార్యే గొప్పది:** మేము ఒక shop కి వెళ్ళాము. ఆయనకు సంవత్సరానికి 50 లక్షల ఆదాయం వస్తుందట. ఆయన అన్నారు: ' 50 లక్షలలో నేను ౩౦ లక్షలు సమాజ శ్రేయస్సుకు ఉపయోగిస్తున్నాను. అయితే ఇప్పటివరకు అలా సహాయం చేసిన వారిని ఎవ్వరిని కూడా మీ కులం ఏమిటి లేక మతం ఏమిటి అని అడగలేదు'. అప్పుడు మేము చెప్పాము: 'మీ కంటే మీ భార్యదే గొప్ప మనస్సు. ఎందుచేతనంటే ఆవిడ మీకు సహకరించకపోతే మీరు ఇంత ధనసహాయం చేయలేరు'. 'ఆ మాట నిజమండి. నా పేరు కన్నా నా ఆవిడ పేరు మీరు ఎక్కువ తలపెడుతున్నారు' అన్నారాయన.

**ఈశ్వర సంకల్పానికే శక్తి ఉంది కాని మన సంకల్పానికి శక్తి లేదు**: అజ్ఞానం లోంచి కోరికలు వస్తాయి. కోరికలు ఉన్నంత కాలం జన్మలు తప్పవు. అసలు జీవుడంటేనే తీరని కోరికలు కలవాడు. మన సంకల్పానికి శక్తి లేదు. మరి ఇంకా కోరికలు ఎందుకు పెంచుకోవడం? ఇప్పటి వరకు గడచిన మన జీవితాన్ని ఒక్కసారి వెనక్కితిరిగి చూసుకుంటే సంకల్పాలు సంకల్పాలుగానే ఉంటున్నాయి. మన జీవితయాత్ర మాత్రం రైలులా సాగిపోతుంది. అంటే మన సంకల్పాలకు శక్తి లేదని తెలుస్తుంది కదా. తన సంకల్పానికి శక్తి ఉన్నవాడు ఒక్కడే- వాడే ఈశ్వరుడు. తన్ను నియమించేవాడు లేనివాడు ఈశ్వరుడు. తన వల్లే ఈ సృష్టి అంతా నియమింపబడుతున్న వాడే ఈశ్వరుడు. అసలు మన సంకల్పానికి శక్తి లేదు అని గుర్తిస్తే సంకల్పాలు తగ్గుతాయి. శరణాగతి అంటే ఒక్క సంకల్పం కూడా లోకం మీద ఉండకపోవడం. మనస్సులో ఉన్న అన్నీ సంకల్పాలు ఈశ్వరుని చుట్టూ తిరుగుతూ ఉండటమే శరణాగతి. అందుకే భగవాన్ అన్నారు: బీజరూపంలో ఉన్న నీ తలంపే కనిపిస్తున్న ఈ ప్రపంచానికి కారణం.


**గురువు మౌనమే పని చేసుకుపోతుంది. చేసేటప్పుడు చెప్పటం ఎందుకు?:** చాలామంది గురువుగారి దగ్గరికి వెళ్ళాము కాని 'ఎలా ఉన్నారు? ఏమి చేస్తున్నారు? అని పలుకరించలేదు. కనీసం మా ముఖం వంక కూడా చూడటంలేదు అని అంటారు. ఈ పేడ ముఖాలను ఏమి చూస్తాడు. అసలు ఈ పాచిముఖాలకు ఆత్మకు సంబంధం ఏమిటి? పోనీ చూస్తాడు అనుకోండి. ముఖానికా జ్ఞానం లేక మీకా? మీకా బాగు లేక మీ ముఖనికా? మీ ముఖానికి బాగు కావాలంటే బ్యూటీ parlour వెళ్తున్నారు కదా! లేకపోతే ఇంత powder ఎక్కువ రాసుకుంటే సరిపోతుంది. దీనికి గురువు మీవంక చూడటం ఎందుకు? అసలు చేసే పని చేసేస్తూ ఉంటే మీ వంక చూడటం ఎందుకు? వాళ్ళ ఇంటికి వెళితే రవికల గుడ్డ పెట్టారు, మన ఇంటికి వస్తే రవికల గుడ్డ పెడితే సరిపోతుంది అనేటువంటి లాంచనపు పనులు గురువు చేయడు. ఆయన మౌనమే పని చేసుకుపోతుంది. చేసేటప్పుడు చెప్పటం ఎందుకు? గాలిప్రవాహంలో గడ్డిపరక ఎంత వేగంగా కొట్టుకు పోతుందో, అంతే వేగంగా గురువు తన సమక్షంలో మనస్సును హృదయంలోకి నెట్టేస్తాడు.





**అన్నిటినీ మింగేసేదే హృదయం**: ఎంత నీరు వచ్చినా సముద్రం మింగేస్తుంది. అన్నీ కాలువలు, నదులు వెళ్లి సముద్రంలో కలిసినా, ఎంత నీరు వచ్చినా- అది మింగేస్తుంది. అలాగే నీ హృదయంలోకి వెళ్ళావనుకో ఎన్ని కష్టాలు ఉన్నా, ఎన్ని నష్టాలు ఉన్నా, ఎన్ని బాధలు ఉన్నా, ఎన్ని భారాలు ఉన్నా, సంసారపరంగా ప్రకృతిపరంగా తట్టుకోలేని భరించలేని దుఃఖం వచ్చినప్పటికీ అంతా మింగివేయటమే హృదయం యొక్క పని. పరమాత్మ అన్నాడు: 'ఓ అర్జునా! వెళ్ళిపో వెళ్ళిపో. నీ హృదయంలోనికి వెళ్ళిపో. నీ హృదయంలోకి వెళ్ళే వరకు ప్రయాణం ఆపు చేయకు'. నీ హృదయం మహాసముద్రం లాంటిది. ప్రపంచంలో ఎవరికీ లేని కష్టాలు నీకు వచ్చినా లేక ప్రపంచంలో అందరి కష్టాలు వచ్చి నీ మీద పడిపోయినా నీ హృదయం వాటన్నిటినీ పీల్చేసుకుంటుంది. అటువంటి హృదయంలో నిలకడగా ఉండటానికి ప్రయత్నం చెయ్యి. అలా ప్రయత్నం చేయగా చేయగా, నీ ప్రయత్నం లేకుండానే నీ మనస్సు అక్కడ ఉండిపోతుంది. నువ్వు శాంతిగా ఉంటావు. అది అలౌకికమైన శాంతి, అభౌతికమైన శాంతి. భౌతిక మనుష్యులకు దొరకని శాంతి.

**వెతికేవాడు లేడు అని తెలిసేవరకూ మనం మనంగా ఉండలేము:** ఆత్మ నిర్ద్వయాదాత్మ నిష్టతా...ఆత్మ ఒక్కటే అయినప్పుడు తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్న వాడెవడు? ఆత్మని తెలుసుకోవటం అంటే ఆత్మగా ఉండటం. మనస్సే ఆత్మని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుంది అని అనుకుంటే మనస్సు ఆత్మ రెండు అయినాయి కదా. ఒకటి అయ్యేవరకు వెతకండి. వెతికే వాడిని వెతకండి. వాడు కనిపించడం మానేస్తే మీరు ఆత్మగా ఉంటారు. వెతికేవాడు లేడు అని తెలిసేవరకూ మనం మనంగా ఉండలేము. వెతికేవాడే సాధన చేస్తున్నాడు. వాడిని తీసేయండి. ఇంక మీరు సాధన చేయక్కర్లేదు. వెతికితే వెతికేవాడు పోతాడు. అప్పుడు మీరు మిగులుతారు. ఆత్మాగా ఉండే ఉపాయం చూసుకోండి. వెతికేవాడిని అంగీకరించినప్పుడు వాడు ఎక్కడికి పోతాడు? వాడు లేడు అని తెలిసేవరకూ మీరు ఎంత సాధన చేసినా ఆత్మగా ఉండలేరు. ఈ తెలుసుకోవాలి అనుకునేవాడే బుజ్జిగాడు. ఆత్మగా ఉండకుండా మీ తలంపులే మీకు అడ్డు వస్తున్నాయి. తలకాయ పడిపోకుండా ఎవరికీ నిద్రరాదు. రెండోవాడు మీకు తెలుస్తున్నాడు. వీడు ఆత్మని తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడు. కాని వీడే నిజం కాదు అని మీకు తెలియాలి. అప్పటివరకూ మీరు ఆత్మగా ఉండలేరు.


**మనస్సు అంతర్ముఖం అయిన వాడికి కోటి ఆకర్షణలు ఉన్నా అవి ఏమీ చేయలేవు:** లోకంలో చాలా ఆకర్షణలు ఉన్నాయి. కాని అంతర్ముఖం అయిన మనస్సుకు ఆకర్షణలు లేవు, ప్రారబ్ధం లేదు. ఈ ఆకర్షణలు ఎవరు చూస్తున్నారు? బహిర్ముఖం అయిన మనస్సు చూస్తుంది. మనస్సు అంతర్ముఖం అయిన వాడికి కోటి ఆకర్షణలు ఉన్నా అవి ఏమీ చేయలేవు. కొంతమంది మేము కర్మ అనుభవిస్తున్నాం అంటారు. మనస్సు అంతర్ముఖం అయిన వాడికి కర్మ ఏమిటి? మనందరం పరమానందయ్య శిష్యుల్లా ఉన్నాం. చేసిన తప్పులే సవరించుకుంటున్నాం. అదే సంసారం. రేపిటిషనే సంసారం. సంసారంలోంచి బయటపడాలంటే మన మనస్సు అంతర్ముఖం అవ్వాలి. దానికి కొంతవరకు ప్రయత్నం చెయ్యాలి. కాని నీ ప్రయత్నం ఒక్కటే సరిపోదు, గురుఅనుగ్రహం ఉండాలి.



**భగవాన్ ఒక్క అన్నం మెతుకు కూడా waste చేసేవారు కాదు:** మనకు ఎవరో పెడుతున్నారు, అది మనం ఎందుకు waste చేయడం అనేవారు. అన్నం వదిలేస్తే నష్టం ఏమిటి, బయట పడేస్తే కాకులు కుక్కలు తింటాయి కదా అంటే: ' ఏ మీ ఎంగిలి పెట్టాలా? అదేదో ముందే పెట్టొచ్చు కదా' అనేవారు.



**వాక్యం దేవుడై ఉన్నది:** మాటది ఏముందిలే అనుకుంటారు కాని వాక్యం దేవుడై ఉన్నది. ఒక్క వాక్యముతో విశ్వామిత్రునికి వశిష్టునితో గల వైరం పోయింది. ఒకరోజు వశిష్టుడు భార్య వెన్నెలలో కూర్చుండగా, 'వెన్నెల ఎంత బాగుందో కదా, అంతా పరచినట్లు ఉంది' అంది భార్య. దానికి వసిష్టుడు ఏమన్నాడంటే: 'విశ్వామిత్రుని కీర్తిలా ఉంది'. ఆ మాటతో విశ్వామిత్రుడికి వశిష్టునితో గల వైరం పోయింది.



**మిథ్యాచారి నిర్వచనం:** మనస్సులో కోరికలు ఉంచుకొని లేవని చెప్పేవారిని hypocrites లేక మిథ్యాచారులు అంటారు. వాళ్ళు ఈశ్వరుని మోసం చేయలేరు. వాళ్ళని వాళ్ళే మోసం చేసుకుంటారు.



**అరుణాచలేశ్వరునికి తెలియకుండా ఏదీ జరగటంలేదు**: The Mountain is very active inside, working secretly. దీనిని wish fulfilling mountain అంటారు. కొండ secret గా పని చేస్తుంది. ఏవైనా కోరికలు ఉంటే కోరుకోండి అని చెబుతున్నాం కాని భగవాన్ అంటారు: 'మీకు ఏమి కోరికలు ఉన్నాయో వాడికి తెలుసుకదా; మరి తెలుసున్న వాడికి చెప్పడం ఎందుకు? తెలియనివాడికి చెప్పాలి'. భగవంతుడు అంతర్యామి కాని ఇది మనకు అర్థం అవ్వదు. శరీరాన్ని ప్రారబ్ధం ప్రకారం నడిపించేవాడు అంతర్యామి. మొత్తం controller వాడే. మీరు అప్పుడే పెద్దవాళ్ళమైపోయాము, స్వతంత్రులమైపోయాము అనుకోకండి. అసలు మీరు ఉంటే కదా అనుకోవటానికి. మీకు ఒకో సంఘటన ద్వారా ఒకో training ఇస్తాడు అరుణాచలేశ్వరుడు. ఇది ఇలా జరిగిందేంటి, అది అలా జరిగిందేంటి అని అనుకోకండి. ఆయనకు తెలియకుండా ఏదీ జరగటం లేదు. ఆయన్ని కాదని మనం ఏమీ చేయలేము. మీరు లేరు అంటాడు కాని 'నా సంకల్పానికి విరుద్ధంగా ఏది జరగదు' అని చెప్పడు అరుణాచలేశ్వరుడు.

**అరుణాచలేశ్వరుడు దుంగ కాదు ఎలుగుబంటి వంటివాడు**: అరుణాచలం జ్ఞానక్షేత్రం. కొన్నాళ్ళకి మీరు అరుణాచలేశ్వరుడిని వదిలేయాలి అనుకున్నా వాడు మిమ్మల్ని వదలడు. ఒకసారి గోదావరికి వరద వచ్చినప్పుడు ఒకడు కొట్టుకొస్తున్న దానిని దుంగ అనుకుని పట్టుకున్నాడు కాని అది ఎలుగుబంటి. ఒడ్డున ఉన్నవారు దానిని వదిలేసి వడ్డుకి వచ్చేయని చెబుతూంటే : 'నేను దాన్ని ఎప్పుడో వదిలేశాను, అదే నన్ను వదలటంలేదు' అన్నాడు. మీరు ఈ అరుణాచలేశ్వరుడిని దుంగ అని పట్టుకున్నా ప్రమాదమే. వీడు దుంగ కాదు ఎలుగుబంటి.

**భక్తి ఎంత రహస్యంగా ఉంటే అంత మంచిది**: భక్తి అనేది మనకి భగవంతుడికి సంబంధించినది. అనుగ్రహించేవాడు భగవంతుడు. నీ భక్తిని ఇంట్లోవాళ్ళకి కూడా తెలియాలనుకోకూడదు. ఇంట్లోవారు ప్రారబ్ధాన్ని బట్టి వచ్చారు. ఎవరు ఎవరికీ ఏమీ కారు. మన భక్తి ఇతరులకు తెలిసిపోవాలి అనుకుంటే లోపల అహంకారం బలిసిపోయినట్టు. చైతన్యానికి ఇతరులు లేరు. అహంకారానికి ఇతరులు ఉన్నారు. అక్కడ అహంకారం action ఎక్కువ ఉన్నట్లు గుర్తు.

**నేను నాది అనే తలంపులు లేకుండా దుఃఖం రాదని శాస్త్రం చెప్పింది**: దేహం మనస్సూ ఈ రెండూ రెండు సుడిగుండాలు. అక్కడ తప్పించుకున్నవాళ్ళు ఇక్కడ పడిపోతారు. ఇక్కడ తప్పించుకున్న వారు అక్కడ పడిపోతారు. ఆ సుడిగుండాలు మామూలివి కావు. ఏనుగు లాంటి వాళ్ళను కూడా లాగేస్తాయి. ఆ దేహం, మనస్సే నేను నాది తలంపులు. మనం ఆ నేను అనే తలంపు వచ్చాకే మాట్లాడుతాం, ఆలోచిస్తాం, ఏదో పని చేస్తాం. మొత్తం సృష్టంతా ఆ నేననే తలంపు మీదే ఆధారపడి ఉంది. ఏ తలంపు వచ్చాక ఇతర తలంపులన్నీ వస్తున్నాయో ఆ తలంపును పట్టుకోండి. నేను నాది అనే తలంపులు లేకుండా దుఃఖం రాదని శాస్త్రం చెప్పింది. మనకు ఏ రకమైన దుఃఖం వచ్చినా పైకి ఫలానా కారణం వలన దుఃఖం వస్తోంది అని కనిపిస్తుంది కాని లోపల నాది అనే తలంపు ఉంటుంది. అది ఎంత తెలివైనది అంటే పూర్వం పులి వస్తూంటే ఒకడన్నాడట: 'మీకేమి భయం లేదు. నేను కింద ఉంటాను. అందరూ నా పైన పడండి'. పాతే పై వాళ్ళే పులి నోటపడిపోతారని వాడి ఉద్దేశ్యం. అలాగే నాది అనే తలంపు కూడా అంత ప్రమాదమైనది, అంత మోసకారి. ఈ నేను అనే తలంపు నాది అని అనిపింపచేస్తుంది. అదే అన్నిటితో తాదాప్యం చెందుతుంది.

**భగవాన్ అంటే బ్రహ్మమే**: భగవాన్ అన్నారు: 'నన్ను ఈ లోకంలో ఏ సాధనా ఆకర్షించలేదు' కారణం అన్ని సాధనలు చేసి దేన్నైతే పొందాలో అదే ఆయన అయి ఉన్నప్పుడు ఏ సాధన ఆయన్ని ఆకర్షిస్తుంది?

**బ్రహ్మంలో ప్రవేశించడానికి నామ జపం గేటులాంటిది:** నామ జపం కూడా మనోవికాసానికి సహకరిస్తుంది. వాచక జపం కంటే మానసిక జపం మంచిది. నామ జపం చేయగా చేయగా దుర్మార్గంలో ఉన్న మనస్సుకు సన్మార్గం కనిపిస్తుంది. జపం ధ్యానస్థితికి సహకరిస్తుంది. పిల్లలు కూడా చిన్నప్పుడు పైకి చదువుతారు, ఎదిగేకొద్దీ లోపలకు చదువుతారు. జపం చేసేప్పుడు ఇష్టంగా చేయాలి అంటే ప్రాణం, మనస్సు కలవాలి. బ్రహ్మంలో ప్రవేశించడానికి నామ జపం గేటులాంటిది. జపం చేయగా చేయగా ఒకే తలంపు మీద మనస్సు నిలబడి మిగతా అనవసరమైన తలంపులన్నీ నశిస్తాయి. జపం చేసే తలంపు బలపడి హృదయంలోకి తీసుకుపోయి అదికూడా అణిగిపోయి నశిస్తుంది. స్వరూపం తానుగా అనుభవంలోకి వస్తుంది. Mind లోని dust తీసేసుకోవడానికే నామజపం చేయటం. ఆ నామం యొక్క శక్తి మనకు తెలియటంలేదు. స్వామిశివానంద నామం యొక్క ప్రభావం గురించి చెబుతూ ఏమన్నారంటే: ' ఒకవేళ మీ యొక్క బలహీనతలనుబట్టి మీరు నరకానికి వెళ్ళినా నామానికి ఎంత శక్తి ఉందంటే మీరు చేస్తున్న ఆ నామం నరకానికి వచ్చి, నరకంలోంచి మిమ్మల్ని విడుదల చేసి స్వర్గానికి తీసుకువస్తుంది. భగవంతుని యొక్క నామానికి అంత శక్తి ఉంది అనారు స్వామి శివానంద. గాంధీ గారు చివరి క్షణాల్లో కూడా 'హే రాం' అంటూ ప్రాణం విడిచారు. వాల్మీకి కూడా 'రాముని రూపం కంటే రాముని నామం గొప్పది' అని అన్నారు. అందుచేత నామానికి కూడా గొప్ప శక్తి ఉంది. నామం విషయంలో అశ్రద్ధ పనికి రాదు. నామజపం కూడా యజ్ఞం. కృష్ణుడు 'యజ్ఞాలలో జపయజ్ఞం నేను' అని చెప్పాడు. అయితే మీరు చేసే నామం పట్ల మీకు గౌరవం, ప్రేమ ఉండాలి. ఆ నామం పట్ల సజీవమైన విశ్వాసం ఉండాలి. అప్పుడు మీకు unwanted గా మంచి results వస్తాయి. నామజపం రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. namopathy చాలా మంచిది. రోగం వచ్చినప్పుడు మందులు వాడినా, హరి నామం కాని, శివ నామం కాని చేస్తుంటే శరీరం లోపల ఉన్న tissues ఆ నామం వల్ల ఉత్తేజింపబడి రోగం తగ్గడానికి సహకరిస్తాయి. నామజపం సర్వరోగ నివారిణి. అది పైకి అనక్కర్లేదు. లోపల చేసుకోండి సరిపోతుంది. మందులు చేసేది 40% అయితే నామజపం చేసేది 60%. శరీరం లో ఉన్న tissues ని నామజపం condition లో పెడుతుంది. irritation రాకుండా జీవకణాలను ఒక క్రమంలో ఉంచుతుంది. అప్పుడు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

**ఒక్క ఈశ్వరుని ప్రేమ తప్పించి మానవ ప్రేమలన్నీ అహంకారం మీద ఆధారపడినవే:** మన బంధువులతో స్నేహితులతో ఉన్న అనుబంధాలన్నీ ego based. అవి నిజం కాదు. మన నిజమైన చుట్టం ఈశ్వరుడు ఒక్కడే. మన మరణాంతరం మన కూడా వచ్చేవాడు ఈశ్వరుడు ఒక్కడే. ఇవాళటి స్నేహితులు రేపు విరోధులౌతారు. ఇవాళటి విరోధులు రేపటి స్నేహితులౌతారు. ఎందుకంటే మనస్సు కూడా నిజం కాదు. మనస్సు మీద ఆధారపడినవే ఈ అనుబంధాలన్నీ. తల్లీ కూతుళ్ళ మధ్య సంబంధం, అన్నా చెల్లెళ్ళ మధ్య ఉన్న అనుబంధం, అత్తా కోడళ్ళ మధ్య ఉన్న అనుబంధం ఎప్పుడూ సమానంగా ఉండవు. అలాగే భార్యా భర్తల మధ్య ఉన్న అనుబంధం కూడా సమానంగా శాశ్వతంగా ఉండవు. ఎప్పుడూ uniform గా ఉండవు. అందులో భార్యాభర్తల అనుబంధంలో ఎక్కువగా ups and downs వస్తూంటాయి. కారణం ego based అది. ఆ మధ్య కేంద్రంలో ఒక మంత్రి రాజీనామా చేస్తే భార్య చాలా బాధపడింది. అప్పుడా మంత్రిగారు భార్యతో అన్నారు: 'నువ్వు నన్ను పెళ్లి చేసుకున్నావా లేక నా పదవిని పెళ్లి చేసుకున్నావా? నన్ను పెళ్లి చేసుకుంటే నా పదవిపోతే నువ్వు అంత బాధపడవే. బహుశా నువ్వు నా పదవినే పెళ్లి చేసుకొనుంటావు. అందుకే నీకంత agitation వస్తోంది'. బృహదారణోపనిషద్లో అన్నారు: భర్త భార్యని, భార్య భర్తని ప్రేమిస్తున్నారు అనుకుంటున్నారా? కాని ప్రతివాడికి నేను అంటేనే ఇష్టం. ఆ నేను కి భార్య అంటే ఇష్టం. అందుకే భార్యను ప్రేమిస్తాడు. ఆ 'నేను' కోసమే భార్య భర్తను ప్రేమిస్తుంది. నిజమైన నేనులో భార్యా, భర్తా, దేహం, లోకం ఏవీ లేవు. Jeevan muktha is independent of everyone and everything. ఏ మనిషి యొక్క ప్రభావం వారిమీద ఉండదు. మాట్లాడినా నీటి మీద గీతలా ఉంటుంది. ఏ సంఘటన ప్రభావం వాడి మీద ఉండదు. మీరు ఇంటికి వెళ్ళాక మీ భర్త మాట్లాడక పోతే మీ సాధనంతా గల్లంతు అయిపోతుంది. ఇంట్లో వాళ్ళ ప్రభావం మీ మీద పడుతూంటే మీరు జీవన్ముక్తులు కాదు. ౩౦౦ కోట్లమంది భగవంతుడు లేడని అన్నా వాడికేమీ వికారం రాదు. That is కృష్ణ. That is ఈశ్వర.





**Beauty is Truth, Truth is beauty:** రామాయణం అంతా తిరగేస్తే సొంతపనంటూ లేనివాడు ఒక్క ఆంజనేయస్వామే. ఒకసారి నాకు బాలాంజనేయ స్వామి స్వప్నంలో దర్శనం ఇచ్చాడు. ఎంత సౌందర్యం అంటే సౌందర్యం అంతా ఒక రూపుదాల్చి వచ్చినట్లు ఉంది. ఇప్పుడు కూడా జాగ్రదావస్థలో ఆ సౌందర్యం ఎక్కడైనా కనిపిస్తుందేమో అని నా కళ్ళు వెతుకుతా ఉంటాయి. ఇప్పటివరకు ఆ సౌందర్యం భౌతికంగా ఎక్కడా కనపడలేదు. ఆంజనేయస్వామికి వాల్మీకి కూడా న్యాయం చేయలేడు అనిపించింది. వాల్మీకి మాట విడిచిపెట్టేయండి. ఒకవేళ సరస్వతీదేవి వర్ణించటానికి ప్రయత్నించినా ఆంజనేయస్వామి సౌందర్యం వర్ణించలేదు అనిపించింది. ఎందుకు చెబుతున్నానంటే భౌతికమైన, శారీర సౌందర్యమే అంత గొప్పగా ఉన్నప్పుడు హృదయ సౌందర్యం ఎంత గొప్పగా ఉంటుంది? Beauty is Truth, Truth is beauty. సత్యానికి మించిన సౌందర్యం అంటూ ఏమీ లేదు. సత్యానికి మించిన జ్ఞానం ఏమీ లేదు. సత్యానికి మించిన ఆనందం లేదు. సత్యానికి మించిన శాంతి, కాంతి లేవు. అందుకే సత్యం, జ్ఞానం అనంతం అన్నారు. దాని తాలూకా అనుభవనం పొందటానికే ఈ భూమి మీదకు వచ్చాము కాని కేవలం మన body ని cover చేసుకోవటానికి, అన్నం తిని బట్టలు కట్టుకోడానికి రాలేదు.